


కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి వైసిపి ఓర్వలేని తనంతో జరుగుతున్న సంక్షేమం అభివృద్ధిపై విష ప్రచారాన్ని చేస్తుంది.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 03.07.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 72 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# అభివృద్ధి గణాంకాల్లో కాదు... ప్రజల జీవితాల్లో కనిపించాలి

- ప్రజల జీవితాల్లో మార్పే అభివృద్ధికి అసలైన కొలమానం: సీఎం చంద్రబాబు
- డేటా ఆధారిత పాలనతో స్వర్ణాంధ్ర-2047 లక్ష్యసాధన
- ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ వర్క్‌షాప్‌లో ప్రసంగం

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** తాను ఆర్థిక శాస్త్రం చదివినా... పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే కాకుండా, ఆ వృద్ధి పేదల జీవితాల్లో ఎంత మార్పు తీసుకొస్తోందన్నదే ప్రభుత్వానికి అసలైన కొలమానమని స్పష్టం చేశారు. జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి ఆర్థిక సూచికలను విశ్లేషిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా పాలన సాగిస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో భాగంగా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన ఎకనమిక్ ఇంటెలిజెన్స్ ఫర్ గవర్నెన్స్ పేరుతో జరిగిన రాష్ట్రస్థాయి రెండు రోజుల వర్క్‌షాప్‌లో గురువారం సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. డేటా ఆధారిత పాలన, సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన ద్వారానే రాష్ట్రాన్ని బలమైన ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా విజన్-2020 రూపొందించినప్పుడు విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, భవిష్యత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి పనిచేశామని గుర్తు చేశారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కూడా దేశానికి విజన్ డాక్యుమెంట్ అవసరమని భావించారని చెప్పారు. ఐటీ విప్లవం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చిందని, సేవల రంగంలో విప్లవాన్ని అందిపుచ్చుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందని అప్పుడే విశ్వసించి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం డేటానే సంపదగా మారిందని, భవిష్యత్‌లో డేటా ఆధారిత నిర్ణయాలకే అత్యధిక ప్రాధాన్యం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సమర్థవంతంగా అందించడం ఎంత ముఖ్యమో, రాష్ట్రంలో సంపద సృష్టించేందుకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం కూడా అంతే కీలకమన్నారు. అందుకే స్వర్ణాంధ్ర-2047 విజన్‌లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రధాన అంశంగా చేరుస్తున్నామని తెలిపారు. అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా అనుసంధానం చేయడానికి డేటా లేక్ రూపొందిస్తున్నామని, ప్రభుత్వ శాఖలన్నింటి డేటాను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని వివరించారు. ఆరోగ్య సేవలను మరింత మిగతా 2లో...





## మైనారిటీల సాధికారతకు పెద్దపీట

- మంత్రి ఎన్ఎండీ ఫరూక్


**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం "స్వర్ణాంధ్రప్రదేశ్-2047" లక్ష్య సాధనలో భాగంగా మైనారిటీల సంక్షేమం, సామాజిక న్యాయం, న్యాయపాలనకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. గత రెండేళ్లలో మైనారిటీల సంక్షేమం, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, హజ్ సేవలు, డిజిటల్ పరిపాలన, కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమం వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం గణనీయమైన పురోగతి సాధించిందని అమరావతిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మిగతా 2లో...

## ఓటే ప్రజాస్వామ్యానికి అసలైన బలం

- అర్హులందరూ ఓటరుగా నమోదు కావాలి
- ఇంటింటి ఓటర్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్
- ప్రతి ఓటును సద్వినియోగం చేసుకోవాలని పిలుపు

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటు ప్రజాస్వామ్యానికి పునాదిలాంటిదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కుల్లో ఓటు హక్కు ఒకటని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని 11, 12వ వార్డుల్లో జరుగుతున్న ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో అధికారులు, బీఎల్‌వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి పరిశీలించి ఓటర్లకు గణన పారాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ, ఓటు ద్వారా ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఉంటుందని, మంచి నాయకత్వాన్ని మిగతా 2లో...



## అమరావతిపై జగన్ కక్ష!

- 3 రాజధానులంటేనే వైసీపీకి 11 సీట్లిచ్చారు
- మావిగన్ తో జగన్ పార్టీని ప్రజలే భూస్థాపితం చేస్తారు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి

2లో

## సీమ అంతటా పారిశ్రామిక ప్రగతి

- స్టీల్ ప్లాంట్ తో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి
- ఓర్వలేక జగన్ డైవర్షన్ పాలిటిక్స్
- కూల్చడాలు, దోపిడిలే జగన్ క్రెడిట్
- ఆ క్రెడిట్ మాకవసరం లేదు : మంత్రి సవిత

2లో

## దేశ ఆర్థిక శక్తిగా ఏపీ

- 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే సంకల్పం
- 75 వేల ఉద్యోగాలే లక్ష్యమన్న మంత్రి లోకేష్
- పార్టీ నిర్వహణలో కృత్రిమ మేధ వినియోగం
- స్టార్టప్‌లు, నైపుణ్యాలే యువతకు బాట
- శ్రీసిటీ వర్సిటీ ప్రారంభోత్సవంలో లోకేష్



**శ్రీసిటీ (తిరుపతి) (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ ఆర్థికాభివృద్ధిలో మనరాష్ట్రం ముందుండాలన్నదే మా ధ్యేయం. ప్రస్తుతం మనం 220 బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్లకు తీసుకెళ్లాలని కృతనిశ్చయంతో ఉన్నామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శ్రీసిటీలో శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీని మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఇక్కడున్న వాళ్లందరికీ మా సీఎం గారి గురించి తెలుసు. ఆయన ఒక కల కన్నారంటే, దాన్ని అచీవ్ చేసి తీరుతారు. ఆయనకు పెద్ద విజన్ ఉంది, ఆ కల సాకారానికి మమ్మల్ని కూడా అదే స్పీడ్ లో పరుగెత్తిస్తున్నారు. మన ప్రధాని నరేంద్ర మోదీ గారి లాంటి గొప్ప విజనరీ లీడర్ షిప్ లో, న్యూ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) నుంచి స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, వికసిత్ భారత్ దాకా ఎడ్యుకేషన్ సిస్టమ్ లో చాలా మార్పులు వస్తున్నాయి. మన ఎడ్యుకేషన్ మినిస్టర్ ధర్మేంద్ర ప్రధాన్ గారు కూడా కొత్త మోడల్స్ తో రాష్ట్రాలు ముందుండి నడిపించాలని మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ రోజుల్లో ఏదైనా ఒక రాష్ట్రం చేసి చూపిస్తే, మిగతా రాష్ట్రాలు వాళ్ళతో పోటీ పడతాయని ఆయనకు తెలుసు. మొన్న మేం ఈ ఇన్ స్టిట్యూట్ గురించి మాట్లాడుకున్నప్పుడు ఆయన నాకు ఇచ్చిన మెసేజ్ కూడా ఇదే.

**ఏపీ యువతకు వరం శ్రీసిటీ యూనివర్సిటీ :** శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రారంభోత్సవంలో పాల్గొనడం నాకు చాలా సంతోషంగా ఉంది. ఒక ఐడియాని తీసుకుని దాన్ని గ్రౌండ్ లెవల్ లోకి తెచ్చి నిజం చేసిన శ్రీని రాజు గారికి నా అభినందనలు. ఆంధ్రప్రదేశ్ లాంటి గొప్ప రాష్ట్రంలో ఇలాంటి ఒక వరల్డ్ క్లాస్ ఇన్స్టిట్యూట్ ని కట్టినందుకు ఆయనకు నా ధన్యవాదాలు. ఇది నిజంగా ఏపీ యూత్ కి ఒక పెద్ద గిఫ్ట్. మిగతా 3లో...

## గ్రామాల వికాసమే లక్ష్యం

- రూ.12,845 కోట్లతో వీబీజీ రాంజీ అమలు
- ఉపాధి, మౌలిక సదుపాయాలకు పెద్దపీట: పవన్ కళ్యాణ్



**రైల్వే కోడూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణ భారతానికి కొత్త శక్తినిచ్చే "వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ (వీబీజీ రాంజీ)" పథకం గ్రామాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ముక్కావారిపల్లెలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కమలేష్ పాశ్వాన్ సమక్షంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్, గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.

ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసి ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించాలని కోరగా వెంటనే అంగీకరించారని పవన్ కళ్యాణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వీబీజీ రాంజీ పథకానికి దేశంలోనే మూడో అత్యధిక కేటాయింపుగా ఆంధ్రప్రదేశ్‌కు నిధులు ఇవ్వడం రాష్ట్రంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.7,700 కోట్లు కేటాయించగా, రాష్ట్ర వాటాతో కలిపి మొత్తం రూ.12,845 కోట్లతో పథకాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సంస్కరణలతో పని దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం ద్వారా గ్రామీణ కార్మికులకు అదనంగా 25 రోజుల ఉపాధి లభిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పంటల సాగు సమయంలో రైతులకు కూలీల కొరత లేకుండా 60 రోజులపాటు పనులకు విరామం కల్పించడం రైతులకు కూడా ప్రయోజనకరమని చెప్పారు. ఈ మార్పులతో గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు మరింత వేగవంతమవుతాయని పేర్కొన్నారు. మిగతా 2లో...

## ఏవియేషన్ హబ్‌గా ఏపీ




- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి భేటీ
- రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా ఏవియేషన్ విస్తరణ
- కేంద్ర సహకారంపై ఢిల్లీలో కీలక సమావేశం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో రాబోయే 20 ఏళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడిని కలిసిన ఆయన, ఆంధ్రప్రదేశ్‌లో ఏవియేషన్ రంగ అభివృద్ధి కార్యాచరణ, పెండింగ్ అనుమతులు, కొత్త విమానాశ్రయాల ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశకత్వంలో రాష్ట్రంలోని మిగతా 2లో...

## చదువుతో పాటు ఉపాధి

- లోకేష్ చేతుల మీదుగా వర్క్-స్టడీ మోడల్ వర్సిటీకి శ్రీకారం

**శ్రీసిటీ (తిరుపతి) (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు చదువుకుంటూనే నైపుణ్యాలను సాధిస్తూ సంపాదించే వర్క్ స్టడీ మోడల్ విశ్వవిద్యాలయం శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో SIU గ్లోబల్ అడ్వైజరీ కౌన్సిల్, గవర్నింగ్ బోర్డు, పరిశ్రమ భాగస్వాములు పాల్గొన్నారు. ఎస్ఐయు వర్క్ - స్టడీ (పని చేస్తూ-చదువు) డ్యుయల్ మోడల్ విధానంలో ఏర్పాటైంది. ఈ మోడల్ ద్వారా ప్రతి విద్యార్థి స్టడీ సమయంలో నేర్చుకున్న విద్యతో పాటు వాస్తవ ఉద్యోగ అనుభవం పొంది మార్కెట్‌కు సిద్ధమవుతాడు. భారత్ లో ప్రతిఏటా సంవత్సరానికి 90 లక్షలకి పైగా గ్రాడ్యుయేట్స్ వివిధ యూనివర్సిటీల నుంచి బయటకు వస్తున్నారు. అందులో సుమారు 42.6% మంది మాత్రమే సంబంధిత నైపుణ్యాల్లో అర్హులని ఒక అధ్యయనంలో తేలింది. చాలా మంది తమ అర్హత కన్నా తక్కువ స్థాయిలో ఉద్యోగాలు పొందుతున్నారు. చాలామంది ఉద్యోగార్థుల్లో నైపుణ్య లోటు స్పష్టంగా కన్పిస్తోంది.

**నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థ ఎస్ఐయు :** SIU ఒక దాతృత్వ ఉద్దేశంతో స్థాపించబడింది. టెక్నాలజిస్టులు, పారిశ్రామిక నిపుణులు, దాతలు కలిసి ఈ యూనివర్సిటీని ఏర్పాటుచేశారు. ఇది Sricity Education Foundation ద్వారా AP State Private Universities Act కింద ఏర్పాటు చేయబడి, Section 8 కంపెనీగా నాన్ ప్రాఫిటబుల్ విద్యాసంస్థగా పనిచేస్తోంది.



**వర్క్-స్టడీ మోడల్ ఎలా పని చేస్తుంది?**

ఈ విధానంలో విద్యార్థులు తమ స్టడీలో మూడోవంతు సమయం మాత్రమే క్యాంపస్‌లో చదువుతారు. మిగిలిన సమయంలో పరిశ్రమల వద్ద ఇంటర్న్‌షిప్‌గా పనిచేస్తారు. మొదటి సంవత్సరం నుండే విద్యార్థులకు కనీసం నెలకు రూ. 10,000 స్టైపెండ్ అందుతుంది.

పనిలో నిపుణత పెరిగే కొద్దీ పరిశ్రమలు స్టైపెండ్ పెంచతాయి. మిగతా 2లో...

## మైనారిటీల సాధికారతకు పెద్దపీట



(మొదటి పేజీ తరువాయి)

2024-25 నుంచి 2026-27 వరకు మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.16,147.23 కోట్ల బడ్జెట్ కేటాయించగా, గత రెండేళ్లలో రూ.9,759.70 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. ఎన్టీఆర్ భరోసా, తల్లికి వందనం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, దీపం-2 వంటి పథకాల ద్వారా లక్షలాది మైనారిటీ కుటుంబాలు లబ్ధి పొందాయని చెప్పారు. "తాలిమ్-ఎ-హునర్" ద్వారా కార్పొరేట్ విద్య, టెట్, డీఎస్సీ, నీట్, ఎంసెట్ కోచింగ్, ఉర్దూ విద్యార్థులకు ఉచిత వర్క్‌బుక్‌లు, సీఈడీఎం ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో విద్యా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో 1,500 సంస్థల సర్వే పూర్తి చేసి, 88 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని, 5,028 వక్ఫ్ సంస్థల వివరాలను సెంట్రల్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం, మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పీఎంజీవీకే, పీఎం వికాస్ పథకాల ద్వారా మౌలిక వసతుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో భాషాభివృద్ధి, కంప్యూటర్ శిక్షణా కేంద్రాల ద్వారా డిజిటల్ నైపుణ్యాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు.
న్యాయపాలన బలోపేతానికి రూ.216 కోట్లతో కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధి, న్యాయవాదుల సంక్షేమ పథకాల విస్తరణ, ఈ-కోర్టుల బలోపేతం, చట్టాల సంస్కరణలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. 2026-27లో రూ.1,000 కోట్లతో పీఎంజీవీకే అభివృద్ధి పనులు, సుమారు 30 వేల మందికి నైపుణ్య శిక్షణ, 96 కొత్త కోర్టుల ఏర్పాటు, 1,770 మంది సిబ్బంది నియామకం, కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు.

## ఏవియేషన్ హబ్‌గా ఏపీ




(మొదటి పేజీ తరువాయి)

ప్రతి 150 కిలోమీటర్ల పరిధిలో ఒక విమానాశ్రయం ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.
సమావేశంలో ప్రాంతీయ, అంతర్‌రాష్ట్ర విమాన సర్వీసుల విస్తరణ, ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ) క్లస్టర్ల అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణపై చర్చించారు. అలాగే పుట్టపర్తి సమీపంలో ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ ఫ్లైట్ టెస్టింగ్ కార్యకలాపాలకు ప్రత్యేక ఎయిర్‌స్పేస్ ఏర్పాటు, రాష్ట్రంలోని 10 ప్రాంతాల్లో వాటర్ ఏరోడ్రోమ్‌ల అభివృద్ధి ద్వారా సీప్లేన్ సేవల ప్రారంభం, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంతో హెలిపోర్టుల అభివృద్ధికి కేంద్ర సహకారం కోరారు.
ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో ప్రముఖ ఏవియేషన్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్ తయారీ, మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎంఆర్వో), ఏవియేషన్ శిక్షణ, లాజిస్టిక్స్, వర్టీపోర్ట్ వంటి ఆధునిక మౌలిక సదుపాయాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఆర్అండ్‌బీ, ఐ అండ్ ఐ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి. కృష్ణబాబు, మారిటైమ్ బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్యతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు ఉపాధి




(మొదటి పేజీ తరువాయి)

నాలుగు సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసే సమయానికి వాస్తవ పని అనుభవం (సుమారు 2ం సంవత్సరాలు) వస్తుంది.
**పాఠ్యాంశాల ప్రణాళిక :** కోర్సులు పరిశ్రమలతో కలిసి రూపకల్పన చేయబడతాయి. ప్రతి ఏడాది ఏఐ, పరిశ్రమ మార్పులకు అనుగుణంగా పాఠ్యక్రమాన్ని నవీనీకరిస్తారు. విద్యార్థుల భవిష్యత్తు పనికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు నేర్చుకుంటారు.
**ఎంటర్ ప్రెన్యూర్ షిప్ :** క్యాంపస్‌లో Station-S అనే ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. Station-S, Gnan Circle Ventures సహాయంతో సుమారు 10 స్టార్టప్స్ ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాయి. ఇక్కడ పరిశ్రమ అనుకూల విద్యతో పాటు జీవన నైపుణ్యాలు, సృజనాత్మక మేధస్సు పెంపొందిస్తారు.
శ్రీసిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రోగ్రామ్ లు- ప్రవేశాలు, 2026--27కి అందిస్తున్న కోర్సులు

1). B.Tech - Computer Science & Engineering (School of Technology & AI)
2). B.Tech - Advanced Manufacturing (School of Advanced Manufacturing)
3). BBA--- Finance & Accounts (School of Business)
4). BBA--- Digital Media & Communications (School of Nova Media)


ప్రవేశాలు ఇప్పటికే ప్రారంభయ్యాయి. ఆన్‌లైన్ దరఖాస్తు: www.thesiu.org
ప్రవేశాల సమాచారం: o91 8977763331/o91 8977763332
ఈ-మెయిల్: admissions@thesiu.org



# అభివృద్ధి గణాంకాల్లో కాదు... ప్రజల జీవితాల్లో కనిపించాలి

(మొదటి పేజీ తరువాయి)

మెరుగుపరిచేందుకు హెల్త్ రికార్డులను పూర్తిగా డిజిటలైజ్ చేసి సంజీవని ప్రాజెక్టు అమలుకు కార్యాచరణ రూపొందించామని చెప్పారు.
**సమాజానికి తిరిగి కొంత ఇవ్వాలి... :** పేద-ధనికుల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించామని ముఖ్యమంత్రి తెలిపారు. సమాజం ద్వారా ఎదిగిన వారు తిరిగి సమాజానికి అండగా నిలవాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని చెప్పారు. ప్రతి కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వర్క్‌షాప్‌లో పేదల జీవన ప్రమాణాలపై మాట్లాడిన ముఖ్యమంత్రి, తాను స్వయంగా పెన్షన్ పంపిణీ చేసిన తులశమ్మ, పద్మమ్మ కుటుంబాల పరిస్థితులను ఉదహరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డ్వాక్రా రుణాల ద్వారా ఆ కుటుంబాల జీవితాల్లో వచ్చిన మార్పును సభికులకు వివరించారు. జీఎస్‌డీపీ, సీఏజీఆర్ వంటి గణాంకాలను విశ్లేషించడం మాత్రమే కాదు, వాటి ప్రభావం ప్రజల జీవితాల్లో ఎలా ప్రతిఫలిస్తోందో అంచనా వేస్తూ పాలన సాగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంలోనే తాను ఆర్థిక శాస్త్రం చదివానని... కానీ పుస్తకాల కంటే సమాజం, ప్రజల నుంచే ఎక్కువ నేర్చుకున్నానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల అసలు లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమేనని సీఎం




స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలనకు కేవలం గణాంకాలు సరిపోవని, ప్రతి కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా ఎదగాల్సిందేనని పేర్కొన్నారు. అనంతరం సభికులతో జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తాను త్వరగా సంతృప్తి చెందే వ్యక్తిని కాదన్నారు. సంతృప్తి చెందితే అదే స్థితిలో ఆగిపోతామని, అందుకే ప్రజల కోసం నిరంతరం కొత్త విధానాలను అన్వేషిస్తూ ముందుకు సాగాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకోవడంతో పాటు, ఈ రంగంలో సొంత వ్యవస్థలను కూడా అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఒకే లక్ష్యంతో కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశం నాకేమిచ్చింది అనే దానికంటే... దేశానికి మనమేమి చేశామనే దృక్పథంతో పనిచేయాలి అని ముఖ్యమంత్రి కోరారు. భవిష్యత్ సాంకేతికతల వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని, త్వరలోనే అమరావతిలో క్వాంటం కంప్యూటర్ అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. క్వాంటం కంప్యూటర్లను తయారు చేసే సామర్థ్యాన్ని కూడా ఆంధ్రప్రదేశ్ సొంతం చేసుకునే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. తాను నిత్య విద్యార్థిగా ఉంటానని చెప్పిన ముఖ్యమంత్రి... ప్రజల జీవితాల మెరుగుదలకు చక్కటి సలహాలు ఇవ్వాలని వర్క్ షాప్ కు హాజరైన వివిధ రంగాల్లోని నిపుణులు, ఆర్థిక వేత్తలను సీఎం కోరారు.
**ఏపీ విధానాలు భేష్... :** రెండు రోజుల వర్క్ షాప్ సందర్భంగా వివిధ అంశాలపై ప్యానెల్ డిస్కషన్లు జరిగాయి. దీంట్లో భాగంగా కేంద్ర స్టాటస్టిక్స్, ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్ శాఖ కార్యదర్శి డాక్టర్ సౌరభ్ గార్గ్, భారత ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డాక్టర్ వి. అనంత నాగేశ్వరన్, నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ ఆర్. బాలసుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ కె.వి. రాజు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్ లతో కూడిన ప్యానెల్ డిస్కషన్ను ముఖ్యమంత్రి తిలకించారు. సభికుల మధ్యే కూర్చొని ప్యానెల్ చర్చను సీఎం ఆసక్తిగా ఆలకించారు. ఈ సందర్భంగా ఏపీలో అమలవుతున్న వినూత్న కార్యక్రమాలను నిపుణులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్, పీ4 కార్యక్రమం, గ్రామస్థాయిలో డేటా సేకరణ, పాలనలో ఏఐ వినియోగం వంటి అంశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న చొరవను ప్రశంసించారు. పీ4, నియోజకవర్గాల వారీ విజన్ ప్లాన్ వంటి కార్యక్రమాలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో లేవని, వీటిని జాతీయ స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు, హెచ్వోడీలు, జిల్లా, మండల స్థాయి ఉద్యోగులు, వివిధ యూనివర్శిటీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

# అమరావతిపై జగన్ కక్ష!

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శరవేగంగా నిర్మాణం జరుపుకుంటున్న ఆంధ్రుల కలల రాజధాని అమరావతిపై జగన్మోహన్ రెడ్డి కక్ష కట్టాడని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విమర్శించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి పాల్గొన్నారు. భారీగా తరలి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టారు. గ్రీవెన్స్ అనంతరం మంత్రి గొట్టిపాటి మీడియాతో మాట్లాడుతూ., మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవహార శైలిని దుయ్యబట్టారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన అసెంబ్లీ సమావేశాల సాక్షిగా అమరావతి రాజధాని అయితే తనకు ఎటువంటి ఇబ్బందీ లేదని స్పష్టం చేసిన విషయాన్ని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. రైతుల నుంచి 30,000 ఎకరాలు తగ్గకుండా చూడాలని అప్పట్లో జగన్ సలహా ఇచ్చిన విషయాన్నీ ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. అనంతరం తాను ఇక్కడే ఇల్లు కూడా కట్టుకున్నా అన్నాడన్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల



అనంతరం మూడు రాజధానులు అంటూ కాలయాపన చేశాడన్నారు. మూడు చోట్లా ఒక్క ఇటుక కూడా వేయలేదని దుయ్యబట్టారు.
అధికారంలో ఉన్న ఐదేళ్లూ మూడు రాజధానుల పేరుతో కాలక్షాపం చేసిన జగన్., తన కోసం మాత్రం రూ.450 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నాడని మంత్రి గొట్టిపాటి ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రతిపాదించిన మూడు రాజధానులను, ఆ పార్టీ ప్రజలు తిరస్కరించినట్లు తెలిపారు. మూడు రాజధానుల నినాదంతో వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. ఇప్పుడు జగన్ పిచ్చి చేష్టలు, మావిగన్ వ్యాఖ్యలతో సున్నాతో వైసీపీని భూ స్థాపితం చేస్తారని పేర్కొన్నారు. ఐదేళ్లు సర్వనాశనం చేసిన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నాయుడు మళ్లీ పునర్నిమిస్తున్నారని మంత్రి తెలిపారు. రాజధాని ఉండాలంటూ అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేయడంతో పాటు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం, ఆంధ్రప్రదేశ్ ను మిగిలిన రాష్ట్రాలతో పోటీ పడే విధంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దేశ, విదేశాలు తిరుగుతూ పెట్టుబడిదారుల్లో నమ్మకం కల్పిస్తూ వారికి భరోసా ఇస్తున్నారని వెల్లడించారు. దీనితో ఆంధ్రప్రదేశ్ లో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి చెప్పారు. అదే విధంగా ప్రపంచ విఖ్యాత విద్యా సంస్థలు కూడా రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రాన్ని నాశనం చేయడానికే జగన్ మావిగన్ వ్యాఖ్యలు చేస్తున్నాడని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు.

## ఓటే ప్రజాస్వామ్యానికి అసలైన బలం



(మొదటి పేజీ తరువాయి)

ఎన్నుకోవడం వల్ల అభివృద్ధి, పారదర్శక పాలన, ప్రజా సంక్షేమం సాధ్యమవుతాయని అన్నారు. ఓటు వేయకపోతే నిర్ణయించే అవకాశాన్ని కోల్పోతామని, కాబట్టి కులం, మతం, డబ్బు లేదా ఇతర ప్రలోభాలకు లొంగకుండా అభ్యర్థి నిజాయితీ, సామర్థ్యం, ప్రజాసేవను దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని సూచించారు. ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని, ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, కుటుంబంలో ఎవరైనా మరణించి ఉంటే వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ కోరారు. కొత్తగా ఓటు హక్కు పొందే అర్హత ఉన్న వారు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహమ్మద్ కుద్దూస్, అశోక్ వర్ధన్, జొన్నాదుల మహేష్, రమణ, ప్రసాదరావు, కేసన కోటేశ్వరరావు, మల్లవరపు విజయకుమార్, కన్నయ్య, మధు కోనేరు, అచ్చుయమ్మ, అనురాధ, వై. అనిత, బీఎల్‌వోలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సీమ అంతటా పారిశ్రామిక ప్రగతి

**జమ్మలమడుగు (జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమలో పరిశ్రమలు నెలకొల్పుతూ, ఈ ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తుకు సీఎం చంద్రబాబునాయుడు పునాదులు నిర్మిస్తున్నారని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత తెలిపారు. జమ్మలమడుగులో ఏర్పాటు చేయబోయే స్టీల్ ప్లాంట్ తో యువతకు ఉపాధి లభించడమే కాకుండా ఈ ప్రాంత రూపురేఖలే మారనున్నాయన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధితో సీఎం చంద్రబాబునాయుడుకు వస్తున్న పేరు ప్రఖ్యాతలను చూసి, జగన్ రెడ్డి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. ప్రజలను డైవర్ట్ చేయడానికి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నారని, ఆయనకున్న క్రెడిట్ ఏంటో ప్రజలందరికీ తెలుసని విమర్శించారు. జమ్మలమడుగులోని సున్నపురాళ్లపల్లె వద్ద రూ.16,350 కోట్లతో శుక్రవారం చేపట్టబోయే స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనుల ఏర్పాట్లను ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా కృష్ణా చైతన్యరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేశ్ రెడ్డి, ఇతర కూటమి నేతలతో కలిసి జిల్లా ఇన్చార్జి మంత్రి గురువారం పరిశీలించారు. అనంతరం తనను కలిసిన విలేకరులతో జిల్లా ఇన్చార్జి మంత్రి మాట్లాడారు. రాయలసీమలోని అన్ని ప్రాంతాలను సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తున్నారన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేయడమే కాకుండా సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాయలసీమలోని కర్నూలు, చిత్తూరు, కడప సహా అన్ని జిల్లాల్లోనూ పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ, ఈ ప్రాంత యువతకు ఉజ్వల భవిష్యత్తు అందజేస్తున్నారన్నారు.



జమ్మలమడుగులోని సున్నపురాళ్లపల్లె వద్ద రూ.16,350 కోట్లతో శుక్రవారం చేపట్టబోయే స్టీల్ ప్లాంట్ తో వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించనుందన్నారు.
**జగన్ క్రెడిట్ మాకొద్దు :** జగన్ రెడ్డికి ఉన్న క్రెడిట్ ఏంటో ప్రజలందరికీ తెలుసని, ఆ క్రెడిట్ ను చోరీ చేయాల్సిన దుస్థితి తమకు పట్టలేదని మంత్రి సవిత తెలిపారు. ప్రజా వేదికను కూల్చివేయడం, అన్న క్యాంటీన్లు మూసివేసి పేదల కడుపు కొట్టడం, దోచుకోవడం ఇవే జగన్ క్రెడిట్ అని విమర్శించారు. అయిదేళ్లలో ఒక్క పరిశ్రమను జగన్ ఏర్పాటు చేయలేదన్నారు. జే ట్యాక్స్ పేరుతో ఉన్న పరిశ్రమలను రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారన్నారు. ఏయే పరిశ్రమలు తీసుకొచ్చావో జగన్ చెప్పాలని తమ మంత్రి నారా లోకేశ్ ఎన్నో పర్యాయాలు కోరినా, వైసీపీ నుంచి స్పందన లేదన్నారు. రాష్ట్రంలో ఒకవైపు పరిశ్రమలు ఏర్పాటు, మరోవైపు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో సీఎం చంద్రబాబుకు వస్తున్న మంచిని చూసి జగన్ ఓర్వలేకపోతున్నారన్నారు. ఒకరోజు శవ రాజకీయాలు, మరో రోజు డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు, ఇంకో రోజు మహిళల కట్టుబొట్టుపై విమర్శలు చేస్తూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. 2018లోనే రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. అంతకుముందు స్టీల్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ ఏర్పాట్లను, హెలీ ప్యాడ్ ను జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత పరిశీలించారు. సభకు పెద్ద ఎత్తున జనాలు తరలొచ్చే అవకాశముందని, ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగుగుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు.

## గ్రామాల వికాసమే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

గత రెండేళ్లలో కేంద్ర సహకారంతో ఉపాధి హామీ పథకం కింద రూ.16,695 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఉప ముఖ్యమంత్రి వివరించారు. 7 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 40 వేల గోకులాలు, 15,500 పశువుల నీటి తొట్టెలు, గిరిజన గ్రామాల్లో రహదారులు, ఉద్యాన పంటల విస్తరణ, 55.40 కోట్ల పని దినాల కల్పన వంటి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశామని చెప్పారు. అలాగే 2026-27లో 10 వేల కిలోమీటర్ల డొంక రోడ్లు, 15 వేల కిలోమీటర్ల సీసీ, బీటీ రోడ్లు, 500 కిలోమీటర్ల మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.
గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ పాలనలో 24వ స్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను మొదటి స్థానానికి తీసుకొచ్చామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గ్రామ సభల నిర్వహణ, జాతీయ పురస్కారాల సాధన, శ్రామికులకు బీమా సౌకర్యాల పెంపు వంటి చర్యలతో గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందన్నారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా, గ్రామీణాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రగామిగా నిలిచేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# అమరావతి భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు

- **ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిపై వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అయోమయంలోకి నెట్టే ప్రయత్నమేనని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు అమరావతికి మద్దతు తెలిపిన జగన్ తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చి, ఇప్పుడు "మావిగన్" పేరుతో మరో కొత్త నినాదాన్ని తెరపైకి తీసుకురావడం ఆయన వైఖరిలోని అస్పష్టతకు నిదర్శనమన్నారు. ఇది అమరావతి-మావిగన్ మధ్య పోటీ కాదని, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్న నాయకత్వానికి, విధ్వంస రాజకీయాలకు మధ్య



పోరాటమని వ్యాఖ్యానించారు.
అమరావతిలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ బ్యాంకులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, క్వాంటమ్ వ్యాలీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు రూపుదిద్దుకుంటున్నాయని సోమిరెడ్డి తెలిపారు. రూ.57,821 కోట్ల విలువైన 97 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. అలాంటి సమయంలో అమరావతి అభివృద్ధిపై అనుమానాలు సృష్టించడం పెట్టుబడిదారుల్లో అపోహలు కలిగించడమేనని విమర్శించారు. రైతుల త్యాగాలతో నిర్మితమవుతున్న రాజధానిని రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాస్పదం చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు.
అమరావతి ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతీక అని, రాజధాని అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు అంగీకరించరని సోమిరెడ్డి స్పష్టం చేశారు. గతంలో మూడు రాజధానుల ప్రతిపాదనను ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించారని, ఇప్పుడు కొత్త నినాదాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు కూడా ఫలించవని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందని, రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగించే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధితో రూ.7.20 లక్షల వైద్యసాయం



- **చుండూరు మండలానికి చెందిన లబ్ధిదారుడికి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**

**వేమూరు (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా వేమూరు నియోజకవర్గం చుండూరు మండలం యడ్లపల్లి గ్రామానికి చెందిన ముసునూరు శ్రీనివాస్‌కు రూ.7.20 లక్షల వైద్యసాయం మంజూరైంది. మంజూరైన చెక్కును వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు గురువారం లబ్ధిదారుడికి అందజేశారు.

ముసునూరు శ్రీనివాస్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, చికిత్స ఖర్చులకు సంబంధించిన బిల్లులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ప్రత్యేక సిఫార్సుతో ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపించారు. దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం అర్హత మేరకు రూ.7.20 లక్షల వైద్య సహాయాన్ని మంజూరు చేసింది.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఖరీదైన వైద్య చికిత్సలను భరించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని చెప్పారు. వేమూరు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

వైద్యసాయం అందుకున్న ముసునూరు శ్రీనివాస్ మాట్లాడుతూ, చికిత్స ఖర్చుల భారం నుంచి తమ కుటుంబానికి ఉపశమనం కలిగేలా సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తన దరఖాస్తును సిఫార్సు చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## 3న తాడికొండలో ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని శుక్రవారం తాడికొండ నియోజకవర్గ కేంద్రం తాడికొండలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి తాడికొండ క్రాస్ రోడ్స్ వద్ద గల జి.కె.కన్వెన్షన్ లో ప్రారంభం అవుతుందని చెప్పారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని మండకాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

## మంత్రి నారా లోకేష్ చొరవతో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



- **పెదవడ్లపూడిలో రూ.4.17 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల**
- **ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది - మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్**

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోంది. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం సహాయం అందించడమే లక్ష్యంగా పనిచేస్తోంది" అని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ అన్నారు.. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు మొత్తం రూ.4,17,976 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను గురువారం పంపిణీ చేశారు. మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక గొప్ప ఆసరాగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవతో మంగళగిరి నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా నిరంతరం కృషి జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా వెలగపూడి శివకుమారికి రూ.1,27,581, బట్టిప్రోలు గోపి స్వరమ్మకు రూ.1,12,166, వడ్లపూడి దుర్గకు రూ.65,000, తోకల వెంకటేశ్వర్లుకు రూ.56,545, అన్నే పద్మావతికి రూ.41,684, షేక్ అరిఫాకు రూ.25,000 చొప్పున మొత్తం రూ.4,17,976 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేష్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.... మాదల రమేష్‌బాబు, అన్నే చంద్రశేఖర్, చిట్టి బొమ్మ వెంకటేశ్వరరావు, ఊల్లంగి శ్రీనివాసరావు, నడపన దుర్గారావు, కొడవలి ఆనంద్, మినీగ వెంకటేష్, జాలాది సందీప్, కొండపల్లి కిషోర్, షేక్ ఖాసిం, లింగినేని శ్రీనివాసరావు, గుడిమెట్ల ఎల్లయ్య, వాసు, తదితరులు పాల్గొన్నారు.



# దేశ ఆర్థిక శక్తిగా ఏపీ



(మొదటి పేజీ తరువాయి)

ఇది కేవలం స్టార్టింగ్ మాత్రమే అని నా నమ్మకం. ఇక్కడికి వస్తున్నప్పుడు దారిలో మేం మాట్లాడుకున్నట్టుగా.. ఈ క్యాంపస్ లో ఏడాదికి 5,000 మంది స్టూడెంట్స్ తో స్టార్ట్ చేస్తున్నాం. దానికి నేను 'కండిషన్స్ అప్లై' అని ట్యాగ్ పెడతాను. క్యాంపస్ లో 5 వేల మందే అయినా.. మన జర్నీలో మున్ముందు ఇంకా చాలా ఎక్కువ మందే వస్తారని నాకు గట్టి నమ్మకం ఉంది. ఈరోజు కేవలం ఇంకో కొత్త యూనివర్సిటీని స్టార్ట్ చేయడం మాత్రమే కాదు, హయ్యర్ ఎడ్యుకేషన్ గురించి కొత్తగా ఆలోచించే విధానానికి ఇది ఒక పునాది అని భావిస్తున్నాను. ఇండియాకి ఇప్పుడు నిజంగా కావాల్సింది ఇదే. నిన్న నేను గౌరవ రాష్ట్రపతి గారు, ధర్మేంద్ర ప్రధాన్ జీ లాంటి చాలామంది ప్రముఖుల్ని కలిశాను. మన ఇండియాలో హయ్యర్ ఎడ్యుకేషన్ భవిష్యత్ ఎలా ఉండాలనే దానిపై మా మధ్య చాలా డిస్కషన్ జరిగింది. మనం ఇస్తున్న డిగ్రీల సిస్టమ్ లో కచ్చితంగా మార్పు (తీవంవ్) రావాల్సిన అవసరం ఉందని మాట్లాడుకున్నాం. ఇన్నేళ్లుగా.. ఎన్ని డిగ్రీలు ఇచ్చారు, ఎంతమంది పాస్ అయ్యారు అనే దాన్ని బట్టే యూనివర్సిటీల రేంజ్ ని కొలిచేవారు. కానీ ఇకముందు, మనం సొసైటీలో ఎలాంటి మార్పు తీసుకొస్తున్నాం అనేదాన్ని బట్టే మనల్ని అంచనా వేస్తారని నేను నమ్ముతున్నాను.

**శ్రీసిటీ వర్సిటీ ద్వారా 75వేల ఉద్యోగాలు:** ఇప్పుడు కేవలం డిగ్రీ ఉంటే సరిపోదు. ప్రాబ్లమ్స్ ని సాల్వ్ చేయడం, టెక్నాలజీకి తగ్గట్టు మారడం, లైఫ్ లాంగ్ నేర్చుకుంటూనే ఉండేలా మన స్టూడెంట్స్ ని రెడీ చేయడం చాలా ముఖ్యం. శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ (ూ×ఖ) సరిగ్గా అలాంటి ఆలోచనతోనే ఏర్పాటుచేశారు. దీనిద్వారా మరో 75వేల ఉద్యోగాలు తీసుకురావాలన్నది నా టార్గెట్. 2029కల్లా దానిని సాకారం చేయాలి. 31 దేశాల నుంచి 200 కంపెనీలు ఇప్పటికే ఇక్కడున్నాయి. మీరిక్కడ చేస్తున్నది నిజంగా మ్యాజిక్ లాంటిది. ఇండియా ఏంటో చూపించడానికి మీరొక బెస్ట్ ఎగ్జాంపుల్. గత 20 ఏళ్లుగా దీన్ని అచీవ్ చేసినందుకు శ్రీని రాజు గారికి, రవి సన్నారెడ్డి గారికి థాంక్స్. దీనికి ఎంతో డెడికేషన్ కావాలి. కలలు కనడం చాలా ముఖ్యం. శ్రీని రాజు గారు పెద్దగా కలలు కనరని నా ఫీలింగ్, ఎందుకంటే ఆయన ప్రతిరోజూ ఆ కలలోనే బతుకుతున్నారు. ఆయన పెద్ద డ్రీమర్, దాన్ని సాధించడానికి ఆయన మా అందరినీ ఎంకరేజ్ చేస్తుంటారు.

**సిఎం మమ్మల్ని పరుగులు తీయిస్తున్నారు:** ఇండియా ఇప్పుడు చాలా ప్రభావవంతమైన స్థితిలో ఉంది. మన జనాభాలో దాదాపు 65% మంది 35 ఏళ్లలోపు వాళ్లే. ఈ యూత్ పవర్ మనకు పెద్ద స్ట్రెంత్ అవ్వొచ్చు లేదా పెద్ద ఛాలెంజ్ కూడా అవ్వొచ్చు. ఒక యంగ్ పొలిటీషియన్ గా నాకు ఈ రెండింటి మీదా క్లారిటీ ఉంది. నాలాంటి యువ నాయకుల మీద ఈ బాధ్యత ఎంత ఉందో నాకు తెలుసు. వికసిత్ భారత్ స్ఫూర్తితో పాటు, నాకు చాలా టఫ్ బాస్ (ముఖ్యమంత్రి) ఉన్నారు. ఆయన మమ్మల్ని పరుగులు తీయిస్తున్నారు. మా గోల్ చాలా క్లియర్ గా ఉంది. మీలో చాలామందికి నేను ఏపీ ఐటీ మినిస్టర్ గానే తెలుసు. అది నా 'ఇండియా హ్యాట్' అని. కానీ నాకు ఇంకా ఎక్కువ ఇష్టమైనది ఎడ్యుకేషన్ మినిస్టర్ డ్యూటీ.. అదే నా 'భారత్ హ్యాట్'. నేను ఈ రాష్ట్రానికి హెచ్ఆర్డీ (ఎ=ఐ) మినిస్టర్ ని కూడా. మనుషుల స్కిల్స్ ని, టాలెంట్ ని బయటకు తీస్తేనే మనం చాలా అచీవ్ చేయగలం అని నేను గట్టిగా నమ్ముతాను. టెక్నాలజీ ప్రపంచాన్ని మారుస్తుంది, అందులో డౌటే లేదు. కానీ ఆ టెక్నాలజీతో మార్పు తీసుకొచ్చే మనుషుల్ని తయారు చేసేది మాత్రం చదువే. అందుకే మనం చేసే ఏ పనికైనా విద్య ప్రధాన కేంద్రంగా ఉండాలి.

**ఇన్వెస్టర్లకి మా 3ఎ మోడల్:** శ్రీసిటీలో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లకు నేను చెప్పేది ఒకటే. ఏపీ గవర్నమెంట్ గా, కొత్త ఇన్వెస్ట్మెంట్స్ తీసుకురావడం మీద మాకు ఫుల్ క్లారిటీ ఉంది. ఇప్పటికే మన స్టేట్ లో ఇన్వెస్ట్ చేసిన వాళ్ళని కలిసి, మీకు ఏవైనా ప్రాబ్లమ్స్ ఉంటే వాటిని సాల్వ్ చేయడానికి మేం ఇప్పుడు అఫీషియల్ గా ఒక డెస్క్ ని క్రియేట్ చేశాం. మీరు మీ బిజినెస్ ని పెంచుకుంటున్న కొద్దీ మీ అవసరాలు మారుతాయి, పవర్ రిక్వైర్మెంట్స్ మారుతాయి. ఏపీలో మీ బిజినెస్ ని పెంచుకోవడానికి మీకు ఫుల్ సపోర్ట్ ఇవ్వడానికే ఈ డెస్క్. ఏపీకి పెట్టుబడులకు మావద్ద 3ఎస్ మోడల్ ఉంది. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్. ఒకసారి మేం మీ ప్రాజెక్టుకి ఓకే చెప్పామంటే, అది ఇక మీ ప్రాజెక్ట్ కాదు, మాసొంతదిగా భావిస్తాం. శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ దానికి బెస్ట్ ఎగ్జాంపుల్. ఈ ప్రాజెక్టును నేను క్లియర్ చేసినప్పుడు నేను రష్యాలో ఉన్నాను. ఒక్క నిమిషం కూడా వేస్ట్ చేయలేదు. ఫైల్ నా లాగిన్ కి రాగానే, నేను చదివాను. ఒక మీటింగ్ నుంచి ఇంకో మీటింగ్ కు వెళు తున్న గ్యాప్ లో ఈ ఫైల్ ను నేను క్లియర్ చేశాను. ఆ మూమెంట్ నాకు పక్కాగా గుర్తుంది. మా పార్ట్ నర్స్ అందరికీ మేం ఇచ్చే సర్వీస్ అదే. ఇండియా డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలదని నా నమ్మకం. దానికి ప్రైవేట్ సెక్టార్, పొలిటికల్ సిస్టమ్, అధికారులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి. మనమెవరమూ ఇండిపెండెంట్ కాదు, కలిసి పనిచేయాల్సిందే. ఏపీ ఇప్పటికే డబుల్ డిజిట్ గ్రోత్ తో దూసుకెళ్తున్న రాష్ట్రం. మేం ఇంకా ఫాస్ట్ గా అభివృద్ధి సాధిస్తాం, కానీ మాకు మీ అందరి మద్దతు కావాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తిచేశారు.

**శ్రీసిటీలో ఆ 3 అంశాలే ప్రత్యేకతలు:** శ్రీ సిటీ ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో నాకు బాగా నచ్చిన విషయాలు మూడు ఉన్నాయి. **1. వర్క్-స్టడీ మోడల్:** నేను దీన్ని లెగ్ మోడల్ అంటున్నాను. అంటే Learn (నేర్చుకో), Earn (సంపాదించు), Graduate (డిగ్రీ తీసుకో). ఇది చాలా చాలా ముఖ్యం. నేను ఈ మోడల్ గురించి చాలామంది ఇండస్ట్రీ లీడర్స్ తో, విద్యావేత్తలతో మాట్లాడాను. ఇండియాకి ఇప్పుడు పక్కాగా కావాల్సింది ఇదే అని వాళ్ళు అన్నారు. డిగ్రీ రాగానే చదువు ఆగిపోకూడదు. లైఫ్ లాంగ్ నేర్చుకోవడం అక్కడే మొదలవుతుందని నేను నమ్ముతాను. మనం ఎప్పటికప్పుడు కొత్తవి నేర్చుకుంటూనే ఉండాలి. ఈ లెగ్ మోడల్ మన ఎడ్యుకేషన్ సిస్టమ్ నే మార్చేస్తుందని నేను నమ్ముతున్నాను.

**2. ఏఐ వాడకం:** మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ఎలా వాడబోతున్నాం అనేది ముఖ్యం. ప్రతి ఇండస్ట్రియల్ రివల్యూషన్ ఎన్ని జాబ్స్ తీసేసిందో, అంతకంటే ఎక్కువ జాబ్స్ క్రియేట్ చేసింది. AI కూడా అలాంటి ఒక పెద్ద ఆపర్చునిటీ. ఒక హెచ్ఆర్ మినిస్టర్ గా, ఐటీ మినిస్టర్ గా.. AI ని నేను ఒక సపోర్టింగ్ టూల్ గా చూస్తున్నాను. ఈరోజు పాలిటిక్స్ లో కూడా మేం AI ని వాడుతున్నాం. ఒక పొలిటికల్ పార్టీగా మా దగ్గర 2 టెరాబైట్ల డేటా ఉన్న డిజిటల్ లైబ్రరీ ఉంది. మేం AI వాడుతున్నాం కాబట్టే, నేను ఏదైనా ప్రెస్ మీట్ లో ఉన్నప్పుడు జస్ట్ టైప్ చేస్తే చాలు ఆన్-ది-స్పాట్ లో ఇన్ఫర్మేషన్ అంతా నా ముందుంటుంది. **3. స్టార్టప్ ఎకోసిస్టమ్:** ఇక్కడున్న నా చెల్లెళ్లని చూస్తున్నాను. చిన్న వ్యాపారాలు (మీవీజులు) ఎంత ఇంపార్టెంట్ రోల్ ప్లే చేస్తాయో మనందరికీ తెలుసు. వీళ్ళ లాంటి అమ్మాయిలే ఫ్యూచర్ లో ఎక్కువ ఉద్యోగాలు క్రియేట్ చేస్తారు. అందుకే మా సీఎం గారు నాకు ఒక క్లియర్ టార్గెట్ ఇచ్చారు. ఆయన టార్గెట్ ఏంటంటే: "ఒక ఫ్యామిలీ, ఒక ఎంట్రప్రెన్యూర్". ప్రతి ఇంట్లో ఒక బిజినెస్ చేసేవాళ్ళు ఉండాలన్నది ఆయన ప్లాన్. అక్కడే AI బాగా యూజ్ అవుతుంది. వాళ్ళు కనీసం AI యూజ్ కేస్ నైనా క్రియేట్ చేయాలి లేదా AI ని వాడటమైనా చేయాలని ఆయన మాకు చెప్తున్నారు. ఒక రైతు దగ్గర్నుంచి, తోపుడు బండి మీద అమ్ముకునేవాళ్ళు, కిరాణా షాపు వాళ్ళ నుంచి AI ఇంజనీర్ల దాకా... ప్రతి ఇంట్లో ఒక ఎంట్రప్రెన్యూర్ ఉండాలి. శ్రీని రాజు గారు, ఇది నేను మిమ్మల్ని అడుగుతున్న మూడో కోరిక. ఈ మోడల్ ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి అనేదానిపై నాకు మీ సపోర్ట్ కావాలి. మనం సక్సెస్ స్టోరీలను చూపించాలి. 'ఒక ఫ్యామిలీ, ఒక ఎంట్రప్రెన్యూర్' అనేది మాకు చాలా కీలకం కాబోతోందని మంత్రి లోకేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ చైర్మన్ శ్రీనిరాజు, ఎండి రవీంద్ర సన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిపై మాట తప్పిందే వైసీపీకి ప్రజల తిరస్కారానికి కారణం

- **పిల్లి మాణిక్యరావు**




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీకి సిద్ధాంతం, నిబద్ధత లేవని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు విమర్శించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2019 ఎన్నికలకు ముందు అమరావతినే రాజధానిగా కొనసాగిస్తానని చెప్పిన జగన్, అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదనతో ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. అందుకే ప్రజలు వైసీపీని 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అమరావతికి చట్టబద్ధత కల్పించిందని, ప్రజాధనంతో చేపట్టిన రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలనే ప్రయత్నాలను ప్రజలు సహించరని పేర్కొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, జగన్ ఇచ్చిన "హే రామ్--సేవ్ ఏపీ" నినాదానికి బదులుగా ప్రజలు "సేవ్ ఏపీ ఫ్రమ్ జగన్" అంటున్నారని వ్యాఖ్యానించారు. జగన్ నిర్వహిస్తున్న ప్రతి విలేకరుల సమావేశంతో వైసీపీకి ప్రజాదరణ తగ్గుతోందని, అమరావతి విషయంలో పలుమార్లు మాట మార్చిన ఆయనపై సొంత పార్టీ నేతలకే అనుమానాలు కలుగుతున్నాయని విమర్శించారు. నేరాలకు పాల్పడిన వారికే జగన్ మద్దతుగా నిలుస్తున్నారని, సామాజిక వర్గాల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైసీపీ నాయకులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

వైసీపీ భవిష్యత్తులో అంతరించిపోయిన ప్రాంతీయ పార్టీల జాబితాలో చేరే పరిస్థితి ఏర్పడిందని కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు భరోసా కల్పిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తోందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. సమావేశంలో నాయుడు ఓంకార్, పడకండ్ల కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## తన వెంట నడిచిన వారిని మరిచిపోని లోకేష్

- **యువగళం బృందంతో శాశ్వత అనుబంధం**



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్):** తన వెంట నడిచిన వారిని మర్చిపోని మంత్రి నారా లోకేష్ పాదయాత్ర బంధం శాశ్వతమని చాటిచెప్పారు. ఏ వేదికైనా, ఏ వేడుకైనా అక్కడ యువగళం పాదయాత్రలో పాల్గొన్నవారు కనిపిస్తే పేరు పెట్టి పలకరించి, ఆగి మాట్లాడి వెళ్లే నారా లోకేష్ యువగళం బంధం.. తరగని అనుబంధం అని మరోసారి నిరూపించారు.

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి వివాహం సందర్భంగా.. కాబోయే దంపతులను ఆశీర్వదించేందుకు తిరుపతిలో వధువు ఇంటికి వెళ్లారు మంత్రి నారా లోకేష్. అక్కడ యువగళం పాదయాత్రలో తనతోపాటు ఎండనక , వాననక నడిచిన టిడిపి సైనికులు కనిపించారు. అక్కడే ఆగి అందరిని పేరుపేరునా పలకరించి వారితోపాటు కూర్చున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు మాట్లాడిన లోకేష్ యువగళం పాదయాత్ర నాటి సంగతులు గుర్తుకు తెచ్చుకున్నారు.

నాటి వైసిపి ప్రభుత్వం అణచివేతను ఎదిరించి మరీ పాదయాత్రను ముందుకు తీసుకెళ్లడంలో ఒక సైన్యంలా పనిచేశారని ప్రశంసించారు. పాదయాత్రలో ఉద్యోగాల కల్పన అవసరాన్ని గుర్తించి ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేర్చేందుకు తీసుకువచ్చిన పెట్టుబడులు కల్పించిన ఉద్యోగాలను యువగళం దళానికి వివరించారు. జాబ్ క్యాలెండర్, టీచర్ పోస్టుల భర్తీ, కానిస్టేబుళ్ల నియామకాలు చేపట్టామని తెలిపారు. కార్యకర్తే అధినేత నినాదంతో టిడిపి కేడర్ సాధికారత సాధించేందుకు చేస్తున్న కృషిని తెలియజేశారు.

సూర్యప్రకాష్ ఎలా ఉన్నావు అంటూ యోగక్షేమాలు కనుక్కున్నారు. ఏమప్పా! వెంకటప్ప కుశలమేనా అని పలకరించారు. చంద్రా బాగున్నావా? అని ఆరా తీశారు. ఎల్లప్ప, లక్ష్మీపతిలతో పాదయాత్ర జ్ఞాపకాలు పంచుకున్నారు. ఒక ఇంటి వాడు కాబోతున్న నాదెండ్ల బ్రహ్మం చౌదరికి శుభాకాంక్షలు తెలిపారు. కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. జస్వంత్, రవి నాయుడులతో మిగిలిన యువ బృందం గురించి అడిగి తెలుసుకున్నారు.

## తాడిపర్రులో రూ.70 లక్షల పీఏసీఎస్ భవనానికి శంకుస్థాపన



**నిడదవోలు (జర్నలిస్ట్ ఫైల్):** ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన ఆర్‌సీసీ భవనానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ గురువారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజల అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ, సొసైటీ సొంత నిధులు, రైతులకు వచ్చే డివిడెండ్లు, దాతల విరాళాలు, సభ్యుల సహకారంతో ఈ భవన నిర్మాణం చేపట్టడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. అత్యాధునిక గోదాం, కార్యాలయంతో కూడిన ఈ భవనం రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు. గత రెండేళ్లలో తాడిపర్రు గ్రామాభివృద్ధికి రూ.3.84 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. పల్లె పండుగ పనులు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు, పంచాయతీ నిధులు, గోకులం షెడ్లు, రహదారుల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. అలాగే 11 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.4.64 లక్షల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో నిడదవోలు నియోజకవర్గానికి రూ.28 కోట్ల శాస్కి నిధులు మంజూరయ్యాయని, అందులో రూ.15 కోట్లు ఉండ్రాజవరం మండలానికే కేటాయించినట్లు పేర్కొన్నారు.

టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక నాణ్యమైన రహదారుల నిర్మాణం చేపడతామని, మిగిలిన పుంత రోడ్లు, డ్రైనేజీలకు కూడా త్వరలో నిధులు సమకూరుస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అర్హులందరికీ త్వరలో కొత్త పెన్షన్లు మంజూరు చేసి, గృహ నిర్మాణాలను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి దుర్గేష్‌కు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.

## పేదలకు దుప్పట్లు పంపిణీ చేసిన డిసి జి. థామస్, జి. సీయోను కుమారి



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పట్టణంలోని ఐతానగర్ సాల్వేషన్ ఆర్మీ చర్చి 161 వ సంస్థాపనల రోజున పురస్కరించుకొని దైవ సేవకులు డిసి జి. థామస్, జి సియోనుకుమారి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘకాపరి మేజర్ జె. క్రిస్తుదాస్, మేజర్ జె.రాజకుమారి, సంఘ పెద్దలు ఆగ్నేష్ బాబు, శివ ప్రసాద్, రాంబాబు, గోపి, సాంబయ్య, నాంచారయ్య మరియు సంఘస్తులు తదితరులుపాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా లిమిటేషన్ ప్రక్రియపై అవగాహన: ఫారాల పంపిణీ



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం రేకులకుంట పంచాయతీ పరిధిలోని డి.అగ్రహారం గ్రామంలో ఓటర్ల జాబితా లిమిటేషన్ ప్రక్రియపై ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించారు. మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు బ్రహ్మంగారిమఠం తెలుగుదేశం పార్టీ టిడిపి అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనల మేరకు గురువారం కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లతో (బిఎల్ఓ) కలిసి ఓటర్లకు లిమిటేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. అనంతరం ఓటర్ల జాబితా సవరణలు, చేర్పులకు సంబంధించిన అధికారిక ఫారాలను ఓటర్లకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో తప్పులు ఉంటే సరిదిద్దుకోవడానికి ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బి ఎల్ వో లు ఝాన్సీ, కళావతి, స్థానిక నాయకులు, బూత్ ఇంచార్జ్ రామచంద్ర పెరుగు నాగేంద్ర, చంద్ర, కొట్టాల శివ యాదవ్, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డి ఆర్ డి ఏ కాకుమాను ఏ పి ఎం గా సురేష్



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** డి ఆర్ డి ఏ కాకుమాను మండలం ఏ పి ఎం గా సురేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏ పి ఎం సుజాత పై వి ఓ ఏ లు అవినీతి ఆరోపణలు చేస్తూ స్థానిక శాసనసభ్యులు దృష్టికి తీసుకువెళ్లడం తో హుటాహుటిన ఏ పి ఎం ను బదిలీ చేశారు. ఆమె స్థానంలో గుంటూరు నుండి సురేష్ కాకుమాను బదిలీ పై వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఏ పి ఎం సురేష్ మాట్లాడుతూ గ్రామాలలో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సిబ్బంది ని సమన్వయం చేసుకుంటూ మండలాన్ని అభివృద్ధి పథం లోకి తీసుకువెళ్తానన్నారు. డ్వాక్రా మహిళలకు పారదర్శకంగా సేవలందిస్తామన్నారు.

# ఎరువులు, విత్తనాలు అధిక ధరలపై జిల్లా కలెక్టర్ హెచ్చరిక

- ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి
- మెనూ ప్రకారం భోజనం పెట్టాలి
- బీఎల్ఓలు అప్రమత్తంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం లో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మిక తనిఖీలు.. ఎరువుల ధరల నుంచి ఆసుపత్రులు, పాఠశాలల వరకు విస్తృత పర్యటించారు. జిల్లాలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి హెచ్చరించారు. బుధవారం పరిగి మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రం, ఆసుపత్రులు, పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. పరిగి మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని అధికారులను ఆదేశించారు. అధిక ధరలకు విక్రయాలు జరిపితే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పరిశీలించారు. ఫారాలు ఎలాంటి తప్పులు లేకుండా నింపాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు అవసరమైతే ప్రజలకు అవగాహన కల్పించి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో బీఎల్ఓలు తప్పని సరిగా గుర్తింపు కార్డు,టోపీ ధరించాలని సూచించారు. అనంతరం పరిగి మండల్ చిట్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, ఇన్‌పేషెంట్ వార్డు, మహిళల వార్డులను కూడా పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం సిద్ధం చేయలేదని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం



వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం తుంకులగడ్డలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, వంట కాలను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచిం చారు. ఈ తనిఖీల్లో ఆర్డీవో వాసు చంద్ర, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.రాంబాబు, డీఎస్సీడబ్ల్యూఓ జయపాల్ రెడ్డి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ హరిప్రియ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రజితతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో యువత ఆర్థికంగా ఎదగాలి

: జర్పుల దశరథ్ నాయక్

**కడ్తాల్ జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా యువత స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని మాజీ జెడ్పీటీసీ,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ సూచించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం పరిధిలోని కడ్తాల్ టోల్‌గేట్ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రుటివ-ఫ్రెష్,ప్యూర్, హెల్త్ కేంద్రాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు పృథ్వీరాజ్ చౌహాన్ మరియు వినోద్ కుమార్ జర్పుల దశరథ్ నాయక్‌ను పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జర్పుల దశరథ్ నాయక్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో వినియోగదారుల విశ్వాసమే వ్యాపార విజయానికి మూలమని అన్నారు. నాణ్యమైన, తాజా ఉత్పత్తులను అందించడంతోపాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త వెరైటీలు, మెరుగైన సేవలను అందిస్తూ వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. స్వయం ఉపాధి ద్వారా యువత ఉపాధి కల్పించడమే కాకుండా మరికొందరికి కూడా ఉద్యోగ అవకాశాలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. నిజాయితీ, నాణ్యత, సేవాభావంతో వ్యాపారం నిర్వహిస్తే ప్రజల ఆదరణతో పాటు ఆర్థికాభివృద్ధి కూడా సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్, గోపి నాయక్, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్,భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుద్య నాయక్, మాజీ సర్పంచ్ నరేందర్ నాయక్, ఉపసర్పంచ్ హీరాసింగ్ నాయక్, గోపాల్ నాయక్,మాజీ ఉపసర్పంచ్ పాండు నాయక్, రాజారామ్, శీను, రాందాస్, కిషన్, ప్రవీణ్, భాస్కర్, రాజా, బాబా, తులసిరాం, బాబూలాల్, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# ఐదేళ్ల నాటి మిస్సింగ్ కేసును ఛేదించిన వికారాబాద్ పోలీసులు

- టెక్నాలజీతో మిస్సింగ్ కేసును చేదించిన పోలీసులు
- జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా నేతృత్వంలో పోలీసుల అద్భుత విజయం

**వికారాబాద్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** వికారాబాద్ జిల్లా పోలీసులు మరోసారి తమ సమర్థతను చాటుకున్నారు. మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ ముస్కాన్-XII కార్యక్రమం ప్రారంభమైన తొలి రోజే ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మహిళ,



బాలుడి మిస్సింగ్ కేసును విజయవంతంగా ఛేదించి వారిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు చేరువ చేశారు. 2020లో నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ తన చిన్నారి బాలుడితో కలిసి అదృశ్యమయ్యారు. అప్పట్లో ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో కేసు దీర్ఘకాలంగా పెండింగ్‌లో కొనసాగింది. ఇటీవల జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు నవాబ్‌పేట్ పోలీసులు కేసును తిరిగి లోతుగా పరిశీలించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కాల్ డేటా, ఆధార్ లింక్‌లు తదితర ఆధారాలను విశ్లేషించిన పోలీసులు కీలక సమాచారం సేకరించారు. వికారాబాద్ డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో, మోమిన్‌పేట్ సీఐ జి. వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఆంధ్రప్రదేశ్‌లోని మునగపాక పోలీస్ స్టేషన్ పరిధికి వెళ్లి సుదీర్ఘ గాలింపు చర్యలు చేపట్టింది. చివరకు మహిళ, బాలుడిని సురక్షితంగా గుర్తించి రక్షించి తీసుకొచ్చారు. ఈ క్లిష్టమైన కేసును సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించిన మోమిన్‌పేట్ సీఐ జి. వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి, పోలీసు సిబ్బంది సాయి కుమార్, మహేందర్ గౌడ్‌లను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మహిళలు, చిన్నారుల



భద్రత విషయంలో వికారాబాద్ పోలీస్ శాఖ ఎప్పుడూ రాజీ పడదని స్పష్టం చేశారు. 'ఆపరేషన్ ముస్కాన్-XII' ద్వారా తప్పిపోయిన పిల్లలు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, బాల కార్మికులను గుర్తించి రక్షించి వారి కుటుంబాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కోసం ప్రతి సబ్‌డివిజన్‌లో పోలీసు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి వికారాబాద్ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పిలుపునిచ్చారు.

# బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరికలు..

– బీఆర్ఎస్‌ను విడిన తలసాని అనుచరుడు

**బేగంపేట్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ లో చేరికలు కొనసాగుతున్నాయి. సనత్ నగర్ నియోజకవర్గంలోని అమీర్ పేట్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు బుట్టి రాజశేఖర్ తన మద్దతుదారులు రమ్య గౌడ్, చక్రధర్ యాదవ్‌తో కలిసి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్, పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా బుట్టి రాజశేఖర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్య క్రమాలు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు. ముఖ్యంగా డాక్టర్ కోట నీలిమ నాయకత్వం, ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న కృషిపై విశ్వా సంతోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వెల్లడించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ.. బుట్టి రాజశేఖర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక స్వాగతం పలికారు. డాక్టర్ కోట నీలిమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై విశ్వాసంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరడం ఎంతో సంతోషకరమని అన్నారు. బుట్టి రాజశేఖర్‌తో పాటు ఆయన మద్దతుదారులు కాంగ్రెస్ కుటుంబంలో చేరడం వల్ల సనత్ నగర్ నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరం సమిష్టిగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరడం పార్టీపై ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావు,ఎస్ఆర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు రవికిరణ్ దేవులపల్లి ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హుల ఓట్లు తొలగిస్తే సహించం : పద్మారావు గౌడ్

- ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి అధికారులకు ఎమ్మెల్యే సూచన
- మరణించిన వారి పేర్లు తొలగించి.. కొత్త ఓటర్లకు అవకాశం కల్పించాలి

**సికింద్రాబాద్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** జంటనగరాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో,ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే,మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను కోరారు.అర్హులైన ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగించకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం జీహెచ్ఎంసీ అధికారుల బృందం మోండా మార్కెట్‌లోని పద్మారావు గౌడ్ నివాసాన్ని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసింది.ఈ సందర్భంగా అధికారులు చేపడుతున్న సర్వే విధానం,నమోదు ప్రక్రియపై ఆయన వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని,అర్హత ఉన్న ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తే ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు.అదే సమయంలో మరణించిన వారి పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువతతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని సూచించారు.ప్రతి ఇంటికి వెళ్లి సరైన వివరాలను నమోదు చేయడం ద్వారా ఓటర్ల జాబితాను తప్పులులేని విధంగా రూపొందించాలని అధికారులకు సూచించారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిష్పక్షపాతంగా,పారదర్శకంగా జరిగితేనే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం మరింత పెరుగుతుందని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.ప్రజలు కూడా అధికారులకు సహకరించి తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## మహిళ పోలీసు అధికారులకు డ్రైవింగ్ శిక్షణ



**రాంగోపాల్ పేట్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీసు మహిళ అధికారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలకు డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నారు. సికింద్రాబాద్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు, మహంకాళి డివిజన్ కు చెందిన మహిళా సిబ్బందికి పి.జి. రోడ్ లోని అన్నా డ్రైవింగ్ స్కూల్‌లో డ్రైవింగ్ శిక్షణను మహంకాళి ఏసిపి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు.మొత్తం 10 మంది మహిళా అధికారులకు ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ పొందనున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ,బి.సురేష్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

## ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రంగరాజుకు శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు..

– మీడియా సేవలను కొనియాడిన ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రంగరాజు..



**వికారాబాద్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు కె.రంగరాజును వికారాబాద్ జర్నలిస్టులు బుధవారం మర్యాదపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై రంగరాజుతో చర్చించారు. జర్నలిస్టుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన రంగరాజు, వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధిలో మీడియా పాత్ర ఎంతో కీలకమైందని పేర్కొంటూ, ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో జర్నలిస్టులు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు.

## అర్హులైన ఓటర్లు ఎస్ఐఆర్‌ను వినియోగించుకోవాలి



**రాంగోపాల్‌పేట్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** అసలైన,అర్హులైన ఓటర్లు భారత ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్‌ను వినియోగించుకోవాలి బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం రాంగోపాల్ పేట్ డివిజన్ పరిధిలో కలసిగూడ ప్రాంతంలోని బూత్ లను బిఎల్ఓలతో కలిసి పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ గత ఎన్నికలో బెంగాల్ లో ఓటు వినియోగించుకుని ఇక్కడ ఓట్లు నమోదు చేసుకున్న అనర్హులైన బెంగాల్ ఓటర్లను ఓటర్ లిస్ట్ నుండి తొలగించాలని.. వారికి ఇనుమరేషన్ ఫామ్ ను ఇవ్వవద్దని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేతలు చీర శ్రీకాంత్, ఎస్ ఆర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణలో తప్పిదాలకు తావివ్వొద్దు..

– మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహా రెడ్డి..



**కడ్తాల్ జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా,నిష్పక్షపాతంగా నిర్వహించాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి బూత్ లెవల్ అధికారులను (బీఎల్‌వోలు) కోరారు.బుధవారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో బీఎల్‌వోలతో కలిసి ఆయన ఏన్యూమరేషన్ ఫారాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు.ఎలాంటి తప్పులు,నిర్లక్ష్యం లేదా బాహ్య ఒత్తిడికి తావివ్వకుండా విధులు నిర్వర్తించాలని బీఎల్‌వోలకు సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌వోలు అత్యంత కీలకమైన బాధ్యతను నిర్వహిస్తున్నారని,వారి పనితీరుపైనే ఓటర్ల జాబితా విశ్వసనీయత ఆధారపడి ఉంటుందని అన్నారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా,అనర్హుల పేర్ల తొలగింపులో ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.ఓటర్లు కూడా బీఎల్‌వోలతో పూర్తి సహకారం అందించి అవసరమైన పత్రాలు,వివరాలను సకాలంలో సమర్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో కీలకమని,అందరూ ఈ ప్రక్రియలో బాధ్యతాయుతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఎల్‌వో శైలజ,బీఎల్ఏ కంబాలపల్లి అంజి దితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ నాయకుల జన్మదిన వేడుకలు



**మణికొండ, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** భారత రాష్ట్ర సమితి పార్టీ మణికొండ, నెక్నంపూర్ సీనియర్ నాయకులు సీతారామ్ ధూళిపాల మరియు కుంభగల్ల ధనరాజుల పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఘనంగా స్థానిక నాయకులు కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుళ్లలో పూజలతో మొదలుకొని ఓల్డ్ ఏజ్ హోంలలో, పురవీధి కూడళ్లలో అన్నప్రసాద వితరణలతో ఘనంగా నిర్వచించారు. ఈ కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ నాయకులు, థి సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు, స్థానిక అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ఓటర్ల జాబితా సవరణకు ఎస్ఐఆర్ కీలకమని

### : వరంగల్ మండల తహసిల్దార్ శ్రీకాంత్



**వరంగల్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**

ఓటర్ల జాబితా సవరణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కీలకమని వరంగల్ మండల తహసిల్దార్ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ పోచమ్మ మైదాన్ ప్రాంతంలో డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి ఆధ్వర్యంలో బీఎల్ఏలు ప్రత్యేకంగా ఓటర్లు జాబితా సవరణపై ఇంటింటికి సర్ పత్రాలను ఓటర్ల కు అందించారు.ఇందులో భాగంగా మండల తహసిల్దార్ శ్రీకాంత్ 15వ బూత్ ను సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ..పక్కాగా ఓటర్ల వివరాలు ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరి చేయడం, చనిపోయిన వారి ఓట్లను తొలగించడం, చిరునామా మారిన వారి వివరాలను అప్డేట్ చేయడం, కొత్తగా అర్హులైన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ డ్రైవ్లో భాగంగా బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తారని ఓటర్లకు అవగాహన ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు బూత్ ఇన్చార్జులు, జన్ను ప్రమోద్,జన్ను ప్రభాకర్,జన్మ శ్రీనివాస్, జన్మ ప్రశాంత్, జన్ను నరేష్, ఇస్మాయిల్, సాబీర్, మంద సన్నీ తదితరులు పాల్గొన్నారు

## దారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ





**వికారాబాద్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**

వికారాబాద్ జిల్లా దారూర్ మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సేవలను అందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న డాక్టర్ శాంతి, డాక్టర్ హిజారాలను ఆసుపత్రి సిబ్బంది ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో వైద్యుల సేవలను కొనియాడుతూ, సమాజానికి వారు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని సిబ్బంది అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల పాత్ర అత్యంత కీలకమని, వారి సేవలు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ వేడుకల్లో ఆసుపత్రి సిబ్బంది పాల్గొని వైద్యుల దినోత్సవాన్ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.

## అధికారులు, సిబ్బంది సహకారం మరువలేను : వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కొనియాడారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన పోలీస్ అధికారులను, సిబ్బందిని ప్రత్యేకంగా అ భిన ందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, వరంగల్ కమిషనరేట్‌లో శాంతిభద్రతలను కాపాడటంతో పాటు అన్ని రకాల నేరాల నియంత్రణలో సిబ్బంది అంతా ఒకరికొకరు సమన్వయంతో పనిచేయడం పోలీసుల ప్రత్యేకత అని ప్రశంసించారు. తన పదవీ కాలంలో అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి తనకు పూర్తి స్థాయిలో సహకరించారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు

## విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యం అవసరం - పోలీసుల ప్రతిభను వెలికితీసేందుకే పోలీస్ డ్యూటీ మీట్ : జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్

**సంగారెడ్డి, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**



ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జోనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనే అవకాశం. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి మూడో పోలీస్ డ్యూటీ మీట్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో పోలీసు అధికారులు, సిబ్బందిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారి వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు పోలీస్ డ్యూటీ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధుల్లో రాణించాలంటే వృత్తి నైపుణ్యంతో పాటు నేర దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల సేకరణ, సాక్ష్యాధారాల పరిరక్షణ, నాణ్యమైన దర్యాప్తు ఎంతో కీలకమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చూపాలని ఎస్పీ సూచించారు.అనంతరం అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్. మాట్లాడుతూ, పోలీసుల విధులకు సంబంధించిన పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కంప్యూటర్, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్‌ప్రింట్స్, సాక్ష్యాధారాల హ్యాండ్లింగ్, ప్యాకింగ్ మరియు లిఫ్టింగ్, బాంబ్ డిస్పోజల్, పోలీస్ జాగిలాల ట్రాకింగ్, ఎక్స్‌ప్లోసివ్ హ్యాండ్లింగ్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు అందజేయడంతో పాటు, జోనల్ స్థాయిలో నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొనేందుకు ఎంపిక చేయనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐలు సురేష్, డానియెల్‌తో పాటు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

## అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో ఉండాలి

### : అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర రెడ్డి

**ఖమ్మం, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**



అర్హులైన ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను అదనపు సీఈవో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. ఈ. శ్రీజ తో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. బుధవారం కూసుమంచి మండలం జుజ్జుల్ రావుపేట, కొనిజర్ల మండలం తనికెళ్ళ, వైరా మండలం కేజీ సిరిపురం గ్రామాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ సరళిని అదనపు సిఇఓ పరిశీలించారు.ఈ సందర్భంగా పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అదనపు సీఈవో, బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), సూపర్వైజర్ల పని తీరును పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, ధ్రువీకరణ ప్రక్రియ, అవసరమైన పత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా, దోషరహితంగా రూపొందించడమే లక్ష్యంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి అర్హుడైన ఓటరును జాబితాలో నమోదు చేయడంతో పాటు, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులను నిబంధనల ప్రకారం తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించాలని, ఫారాల నింపడంలో సహకరించాలని అదనపు సిఇఓ అన్నారు.బీఎల్‌వోలు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిష్పాక్షికంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడంలో ఎస్ఐఆర్ కీలకమని, ఈ ప్రక్రియను సమయపాలనతో పూర్తి చేయాలని అన్నారు. అదనపు సిఇఓ తనిఖీ సందర్భంగా మండల తహశీల్దార్లు, బిఎల్ఓ లు, అధికారులు, తదితరులు ఉన్నారు.

## వంచిస్తే మూల్యం చెల్లించక తప్పదు

**ఖమ్మం, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**




పేదలను వంచిస్తే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హెచ్చరించారు. నివాస స్థలాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పాలకులు పేదల పట్ల కక్ష సాధింపు ధోరణిని ప్రదర్శిస్తున్నారని ఆయన ఆరోపించారు. నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడంతో పాటు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం వామపక్షాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి హేమంతరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పేదలను విస్మరించిన కారణంగానే ప్రజలు తిరస్కరించారని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పంథాను అవలంభిస్తుందని ఆరోపించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నివాస స్థలాలు లేక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిరూపయోగంగా ఉన్న ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారి పట్ల కక్ష సాధింపు ధోరణిలో బుల్ డోజర్లతో కూల్చివేస్తున్నారని తెలిపారు. కనీస మానవత దృక్పథం లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని కూల్చిన చోటనే పేదలకు నివాస స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ప్రభుత్వం చెప్పే మాటలకు వాస్తవ పరిస్థితులకు పొంతన లేదని ఇందిరమ్మ ఇండ్ల మంజూరులోనూ పారదర్శకత లోపించిందన్నారు. పేదలకు నివాస స్థలాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం దశల వారీ పోరాటాలు నిర్వహిస్తామని హేమంతరావు హెచ్చరించారు.

**సంపన్నులు ఆక్రమిస్తే కన్నెత్తి చూడరా**

ఖమ్మం నగరంలో ఎన్నెస్పి స్థలాలతో పాటు ప్రభుత్వ భూములను సంపన్నులు ఆక్రమిస్తే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఫిర్యాదులు చేసినా ఆ వైపు ఎందుకు కన్నెత్తి చూడటం లేదని హేమంతరావు ప్రశ్నించారు. పేదలు ఆక్రమిస్తే బలవంతంగా, దౌర్జన్యంగా అక్కడి నుంచి తొలగించారని పేదల తొలగింపుకు కారణమైన వ్యక్తులే ఆ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి అద్దెలకు ఇస్తుంటే కనిపించడం లేదా, లేక సంపన్నులకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఇప్పటికే ఖమ్మం ఎన్నెస్పి ప్రభుత్వ స్థలాల ఆక్రమణపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకో లేదు. తగు చర్యలు తీసుకోకపోతే పేదలను సమీకరించి అక్రమిస్తామని హేమంతరావు హెచ్చరించారు. నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు మాదినేని రమేష్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, మహ్మద్ సలాం, బిజి క్లెమెంట్, సిపిఎం నాయకులు బొంతు రాంబాబు, మాచర్ల భారతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, సిహెచ్ సీతామహాలక్ష్మి , పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు శాఖమూరి శ్రీనివాసరావు, తాటి నిర్మల, వరదా నర్సింహారావు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు ఇటికాల రామకృష్ణ, శ్రవణ్, చింతల రమేష్, మోహన్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ కి అందజేశారు.

## ఘనంగా తోడేటి జన్మదిన వేడుకలు



**ఖమ్మం, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం నగరంలో గల 42వ డివిజన్ కు చెందిన బి.ఆర్.యస్ నాయకులు తోడేటి లింగరాజు యాదవ్ జన్మదిన వేడుకలు స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఘనంగా మంగళవారం జరిగాయి. ఈ సందర్భంగా వేడుక నిర్వహించిన అభిమానులు తోడేటి సేవలను కొనియాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు దృష్టికి తీసుకు వెళ్తూ సత్వర పరిష్కారానికై కృషి చేసే తోడేటి లింగరాజు యాదవ్ మా మధ్య వుండటం మా డివిజన్ ప్రజలు చేసుకున్న అదృష్టం అంటూ పలువురు తోడేటి చిత్తశుద్ధిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దిశ హాస్పటల్ డాక్టర్ క్రాంతి రణదేవ్ హాజరై తోడేటిని అభినందించారు. డివిజన్ లోని ప్రముఖులు యం.డి. ముజాహిద్, కనకం శేఖర్, నయూమ్, సోహెల్, సుడా డైరెక్టర్ దొంగల తిరపతిరావు, చిలకల వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, జలగం రామక్రిష్ణ, సుభాని, కె.నరేష్, పి.యాదగిరి, శైలజ, జానీ, ధనలక్ష్మి , మమత, తజ్ముల్లా, ఛోటీ, యం.డి.హుస్సేన్, సతీష్‌లతో పాటు స్థానిక యువత పాల్గొని లింగరాజు యాదవ్ కు శుభాకాంక్షలు అందజేశారు. జిల్లా బీ.ఆర్.యస్ నాయకులు కొందరు ఫోన్లో అభినందనలు తెలియజేశారు.

## జమలాపురం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల, మైలవరం శాసన సభ్యుడు వసంత కృష్ణ ప్రసాద్



**ఖమ్మం, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :**
ఖమ్మం జిల్లా, మధిర నియోజకవర్గ పరిధిలోని ఎర్రుపాలెం మండలంలో జమలాపురం గ్రామంలో బుధవారం జరిగిన వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మైలవరం తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ మంత్రి తుమ్మలకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి తుమ్మల, వసంత లకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మలతోపాటు మధిర నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, తుమ్మల అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

## జయమ్మ మృతి పట్ల సంతాపం తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలో ప్రముఖ వ్యాపారవేత్త మలిశెట్టి వెంకటేశ్వర్లు (గీతా వెంకన్న) సతీమణి జయమ్మ మృతి పట్ల బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. జయమ్మ అనారోగ్యానికి గురై హైదరాబాద్ లోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు.ఆమె అకాల మృతి బాధాకరమని ఎంపీ రవిచంద్ర తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.ఆమె భర్త వెంకటేశ్వర్లు, కుటుంబ సభ్యులకు ఎంపీ వద్దిరాజు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు,స్వర్గీయ జయమ్మ ఆత్మ శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు.

## కాంగ్రెస్‌లోకి చేరికల జోరు

- ఆరేకోడు నుంచి అధికార పార్టీలోకి బీఆర్ఎస్, సీపీఎం ముఖ్య నేతలు
- కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి క్యాంపు ఇన్‌చార్జి దయాకర్ రెడ్డి



**ఖమ్మం, జూలై 02 (జర్నలిస్ట్ ఫైల్) :** మండల పరిధిలో కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. బుధవారం ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోట వీరభద్రం ఆధ్వర్యంలో ఆరేకోడు గ్రామానికి చెందిన బీఆర్ఎస్, సీపీఎం పార్టీల ముఖ్య నాయకులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీపీఎం ముఖ్య నేత పేరెల్లి మధు, బీఆర్ఎస్ ముఖ్య నేత ఎనిగండ్ల రాంబాబు తమ అనుచరులతో కలిసి అధికార పార్టీ బాట పట్టారు. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ముఖ్య నాయకులకు కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రజా రంజక పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న విస్తృత అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిలివేరు బాబు, గునిగంటి రమేష్, ఉప్పుగండ్ల ప్రసాద్, గునిగంటి సురేష్, కుసుమ రాజ, అరేంపుల రామారావు, మహిళా నాయకురాళ్లు గన్నోజు గోవిందమ్మ, అరేంపుల సునీత తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా స్తంభాద్రి హాస్పిటల్ వైద్యులకు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఘన సత్కారం



**ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :** డాక్టర్స్ డే సందర్భంగా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో ఖమ్మంలోని స్తంభాద్రి హాస్పిటల్ వైద్యులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విశ్రాంత పోలీసు అధికారుల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, నాణ్యమైన వైద్య సేవలను అందిస్తున్నందుకు డాక్టర్ పేర్ల హర్ష తేజ, డాక్టర్ పేర్ల నవ్య శ్రీ లలిత, డాక్టర్ గట్టినేని సురేష్, డాక్టర్ మేదరమెట్ల అనిల్ కుమార్, డాక్టర్ కొల్లు శ్రీహర్ష, డాక్టర్ దోగిపర్తి కృష్ణ సుమంత్, డాక్టర్ రాఘువేంద్ర గుమ్మడి డాక్టర్ చావా సృజన, డాక్టర్ యస్మితలను దుశ్శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.అదే విధంగా సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కన్నెకంటి శివరామ కృష్ణ, సీనియర్ యూరాలజిస్ట్ డాక్టర్ గురు నాథరావు, అలాగే ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ పత్తి గణేష్‌ను కూడా డాక్టర్స్ డే సందర్భంగా ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్య మైనవని, ముఖ్యంగా విశ్రాంత పోలీసు అధికారుల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ, సంఘ కోశాధికారి కే. సోమయ్య, ఉపాధ్యక్షులు ఎస్. సంజీవ రావు, బి. నాగేశ్వరరావు, విశ్రాంత అదనపు ఎస్పీలు బి. అశోక్ కుమార్, ఆర్. సాయిబాబా, విశ్రాంత అధికారులు ఎం. ప్రసాద్ రావు, వైభోగేశ్వరరావు, ఎన్.వి.జి.కె. ప్రసాద్, డి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కార్యాలయ సిబ్బంది



**ఖమ్మం, జూలై 02(జర్నలిస్ట్ ఫైల్):** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా లోని, ప్రోగ్రాం ఆఫీసర్స్ కి , ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల సేవలు అత్యంత విలువైనవని పేర్కొన్నారు. జిల్లాలోని వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది, కృషితో, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలన్నీ జిల్లాను ముందంజలో ఉంచాలని కోరడం జరిగింది. అనారోగ్య సమయంలో ప్రజలకు అండగా నిలుస్తూ, తమ వ్యక్తిగత జీవితాన్ని సైతం పక్కన బెట్టి నిరంతరం సేవలందిస్తున్న ప్రతి వైద్యుడు సమాజానికి ఆదర్శప్రాయుడని అన్నారు. అత్యవసర పరిస్థితులు, ప్రకృతి వైపరీత్యాలు, అంటువ్యాధుల సమయంలో వైద్యులు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల మానవీయ దృక్పథంతో, నిబద్ధతతో, సేవాభావంతో వైద్య సేవలు అందించడం ప్రతి వైద్యుని బాధ్యత అని తెలిపారు. ప్రజలు కూడా వైద్యుల పట్ల గౌరవం, విశ్వాసం కలిగి వైద్య సూచనలను పాటించాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లాలో ని, ప్రోగ్రాం ఆఫీసర్స్ ల ను, పూల మొక్కలు, శాలువాలతో సత్కరించి,అనంతరం వైద్యులు రోగులకు మరింత నాణ్యమైన, అందుబాటులో ఉండే వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ వేణుమాధవ్ రావు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ మోతియా, ఏవో మమత, డెమో సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డెమో కెవి రాజు, సీనియర్ ఎంటమాలజిస్ట్ వెంకటేశ్వర్లు,హెచ్ ఈ ఓ పుల్లయ్య, డివిఎల్ఎం రమణ,ఎస్ ఓ వీరయ్య, డి డి ఎం నాగరాజు, డిపిఓ దుర్గ, డిపిహెచ్ఎన్ఓ శేషు పద్మ, హెల్త్ ఎడ్యుకేటర్ ఖాదర్ బి,ప్రభుత్వ వైద్యులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## తలనీలాల సమర్పణపై సోషల్ మీడియాలో కించపరిచే పోస్టులు బాధాకరం



- ఎమ్మెల్యే గల్లా మాధవి
- మహిళల వ్యక్తిగత అంశాలపై వ్యాఖ్యలు చేయడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని విమర్శ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల శ్రీవారికి భక్తిపూర్వకంగా తలనీలాలు సమర్పించిన తనపై వైసీపీ సోషల్ మీడియా వేదికగా అవమానకర పోస్టులు పెట్టడం బాధాకరమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గల్లా మాధవి అన్నారు. గుంటూరులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళల వ్యక్తిగత జీవితం, భక్తి విశ్వాసాలు, రూపురేఖలు, దుస్తులను లక్ష్యంగా చేసుకుని విమర్శించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. రాజకీయాల్లో ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేయడం సహజమే కానీ వ్యక్తిగత అంశాలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు.

హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, వాటిని ఖండించాల్సిన వైసీపీ నాయకులు సమర్థించడం మరింత దురదృష్టకరమని గల్లా మాధవి అన్నారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని, మహిళలను అవమానించడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలనుకోవడం అవివేకమని పేర్కొన్నారు. తిరుమలలో తలనీలాలు సమర్పించడం తన వ్యక్తిగత భక్తికి సంబంధించిన విషయమని, దానిని కూడా రాజకీయ విమర్శలకు ఉపయోగించడం వైసీపీ నాయకుల ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తోందన్నారు.

గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని గల్లా మాధవి డిమాండ్ చేశారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని సమర్థిస్తున్న వైసీపీ మహిళా నేతలు తమ వైఖరిని పునఃపరిశీలించుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి మహిళ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, మహిళలను అవమానించే రాజకీయ సంస్కృతిని ప్రజలు తిరస్కరించాలని, హోంమంత్రి వంగలపూడి అనితకు రాష్ట్ర మహిళలంతా సంఘీభావం ప్రకటించాలని ఆమె పిలుపునిచ్చారు.

## గంజాయి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి



- పెండింగ్ చార్జ్‌షీట్లు త్వరగా దాఖలు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గంజాయి, ఇతర మాదకద్రవ్యాల (ఎన్‌డీపీఎస్) కేసుల్లో వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు చేపట్టి పెండింగ్‌లో ఉన్న చార్జ్‌షీట్లను నిర్దేశిత గడువులోపు కోర్టులో దాఖలు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈస్ట్, వెస్ట్, సౌత్ సబ్‌డివిజన్ల డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లాలో నమోదైన గంజాయి, ఎన్‌డీపీఎస్ కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ చార్జ్‌షీట్లు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నివేదికలు, కోర్టు విచారణలో ఉన్న కేసుల స్థితిగతులను సమీక్షించారు.

ప్రతి ఎన్‌డీపీఎస్ కేసులో శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పక్కాగా సేకరించి లోపాలకు తావులేకుండా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. పరారీలో ఉన్న నిందితులను ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించి అరెస్టు చేయడంతో పాటు, కేవలం రవాణాదారులకే పరిమితం కాకుండా ప్రధాన సూత్రధారులు, ఫైనాన్షియర్లు, కొనుగోలుదారుల నెట్‌వర్క్‌ను ఛేదించే దిశగా దర్యాప్తు విస్తరించాలని ఆదేశించారు. ఫోరెన్సిక్ నివేదికలు అందిన వెంటనే వాటిని చార్జ్‌షీట్లకు జతచేసి కోర్టులో సమర్పించాలని, విచారణలో ఉన్న కేసుల్లో సాక్షులను సకాలంలో హాజరుపరిచి పటిష్టమైన ప్రాసిక్యూషన్ నిర్వహించాలని పేర్కొన్నారు.

తరచూ గంజాయి కేసుల్లో అరెస్టవుతున్న నేరస్థులపై అవసరమైన చోట పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిర్బంధ చర్యలు తీసుకోవాలని, పాత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ అవసరమైన చోట సస్పెక్ట్ షీట్లు తెరవాలని ఎస్పీ ఆదేశించారు. సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన ప్రాసిక్యూషన్ ద్వారానే నిందితులకు కఠిన శిక్షలు పడతాయని, మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీలు జి.వి. రమణమూర్తి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మావిగన్ మాయమాటలు ఇంకెన్నాళ్ళు జగన్?

- చేతనైతే రాజధాని అమరావతికి మద్దతు ఇవ్వండి
- సీఎంఆర్ఎఫ్ తో పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం
- 96 మందికి రూ.1.35 కోట్ల విలువైన చెక్కులు పంపిణీ చేశాం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మావిగన్ మాయమాటలు ఇంకెన్నాళ్ళు చెబుతావు జగన్ ? అమరావతి రాజధాని ప్రజల మనోభావాలతో ఇంకెన్నాళ్లు ఆడుకుంటావు ? అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 96 మందికి రూ. 1.35 కోట్ల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కేవలం రెండేళ్లలోనే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సుమారు రూ. 14 కోట్ల విలువైన సీఎం సహాయనిధి ద్వారా పేద ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలిచామని తెలిపారు. నాలుగు రోజుల క్రితం కిడ్నీ సమస్యతో బాధపడుతున్న 20 ఏళ్ల షేక్ మస్తాన్ అనే యువకుడికి ఎల్ఓసి ద్వారా నాలుగు లక్షల రూపాయలకుపైగా నిధులు ఒక్క రోజులో అందేలా చేశామని, ఇది పేదల ప్రభుత్వమని చెప్పారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ కష్టమొచ్చినా తమ ఆఫీసులో సంప్రదిస్తే వెంటనే స్పందిస్తున్నామని అన్నారు. 2019 ఎన్నికలకు ముందు తాను రాజధాని ప్రాంతంలోనే ఇల్లు నిర్మించుకొని ఉంటానని, అమరావతికి మద్దతుగా నిలుస్తానని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట మొదలుపెట్టారని విమర్శించారు. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త నాటకం అడుతున్నారని చెప్పారు. వైసీపీకి చేతనైతే ప్రజా సమస్యలపై అసెంబ్లీలోకి వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమరావతి రాజధానిని దేశంలోనే నంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టిందని, దీనిని ఎవరూ మార్చలేరని స్పష్టం చేశారు.

## పెదరావూరులో హనుమాన్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పూజలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** శ్రీకార్యసిద్ధి హనుమాన్ ఆలయనిర్మాణానికి శంఖుస్థాపన పూజలు తెనాలి మండలంలోని పెదరావూరు అవదూత దత్తపీఠం ప్రాంగణంలో 6ఎకరాల విస్తీర్ణంలోఅరుదైన ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లేందుకు వీలుగా శ్రీ కార్యసిద్ధి హనుమాన్ దేవాలయ నిర్మాణానికి భూమిపూజా కార్యక్రమం వేదపండితుల ఆధ్వర్యంలోవిశేషంగానిర్వహించారు. మైసూరు దత్తపీఠం వ్యవస్థాపకులైన శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దివ్యాశీస్సులతో భక్తుల,భాగస్వామ్యంతో,ఎంతో విశిష్టతను చాటుకునే తీరుగా శ్రీ కార్యసిద్ధి హనుమాన్ ఆలయానికి స్వామి రూపకల్పన చేశారు. ఆలయ శంఖుస్థాపన పూజలు గురువారం ప్రాతః కాలం నుండి విశేషంగా నిర్వహించారు. మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద్, విష్ణుభొట్ల సత్యన్నారాయణ ఘనాపాటి, తదితర వేదాగమ పండితులు, వైఖానస పండితులు పర్యవేక్షణలో,విశేషయజ్ఞపూజలతో నిర్వహించి కార్యక్రమ విశిష్టతను, మైసూరు దత్తపీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద సరస్వతి సంకల్ప విశిష్టతను పండితులు వివరించారు. హనుమాన్ భక్తులు లక్ష హనుమాన్ చాలీసాను ఏక కాలంలో లక్షమంది భక్తులు ఆలపించే విధంగా నాటి కార్యక్రమనిర్వాహకులైన వుప్పల వరదరాజులు మీడియాతో మాట్లాడుతు 2015లో తెనాలిలో హనుమాన్ చాలీసా సేవకు బీజం వేసింది, శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి వారని, వారు ఆనాడే ఈప్రాంతంలో హనుమాన్ ఆలయ నిర్మాణ సంకల్పం చేశారని, అది ఈనాటికి దాతల సహకారంతో, పెదరావూరు దత్తపీఠం, స్వామి ఆశ్రమంలో, కార్యరూపం దాల్చడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. స్వామి సంకల్పం, భక్తుల సహాయసకారములతోనే ఆలయం నెలకొల్పాలని, ఆ లక్ష్యం నెరవేరడంలో నాడు లక్షహనుమాన్ చాలీసాకు తరలి వచ్చినట్లు నేడు శ్రీ కార్యసిద్ధి హనుమాన్ ఆలయ నిర్మాణంలో భక్తులందరూ భాగస్వాములే అన్నారు. హనుమాన్ ఆలయం రూపురేఖలు, ఉపాలయాలు అన్నీ పూర్తి చేసుకున్నాక ఈప్రాంతం అరుదైన ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లు తుందని, వరదరాజులు తమ అభిప్రాయాన్ని, స్వామి సంకల్పాన్ని తెలియజేశారు కార్యక్రమంలో పలు ప్రాంతాల దత్తభక్తులు, స్వామిజీ శిష్యులు తదితరులు పాల్గొన్నారు.

## జబ్బులు ప్రజలకి... డబ్బులు గోతాలు జగన్ ఇంటికి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ అమలు చేసిన మద్యం విధానం లో "జబ్బులు ప్రజలకి... డబ్బులు గోతాలు జగన్ ఇంటికి" వెళ్ళాయని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విమర్శించారు.

పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని జాషువా కళాప్రాంగణంలో గురువారం అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రాష్ట్ర ప్రజలపై దాదాపు రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, అనేక శాఖల ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు చెల్లించలేకపోయిందని, పెన్షన్లు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితిని తీసుకొచ్చిందని ఆరోపించారు. రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తోందన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం, సామాజిక పెన్షన్లను భారీగా పెంచడం, దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచడం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు.

గత ఐదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయని వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలను ఇతర రాష్ట్రాలకు తరలిపోయేలా చేసిందని విమర్శించారు.

అయితే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, లక్షలాది మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

అప్పుల భారం ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని, ఈ నెల 16 నుంచి 18వ తేదీ మధ్య 'తల్లికి వందనం' పథకం నిధులను అర్హుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.

## ముందస్తు అనుమతి లేకుండా ఎండోమెంట్ నిర్లక్ష్యం-భక్తుల ఆగ్రహం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల టౌన్ పరిధిలో కొండా సింగరయ్య స్వామి దేవాలయ పునర్నిర్మాణం నిమిత్తం శ్రీవాణి ట్రస్ట్ దేవాదాయ శాఖ నేతృత్వంలో 20 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే కొండా సింగరేయ స్వామి గుడి సర్వే నెంబర్ 1379 లో 16 సెంట్లలో సుమారు నాలుగు వందల సంవత్సరాల క్రితం నిర్మించబడినటువంటి అతి పురాతన దేవాలయం అయితే ఈ దేవాలయం రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉన్నది ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి దగ్గర ఎన్ఓసి తీసుకోవాలని ఈ ఏడాది జనవరిలో స్థానిక మండల తాసిల్దార్ సర్టిఫై చేయడం జరిగింది. కానీ దేవాదాయ శాఖ అధికారులు ఆ ఉత్తర్వులు మరిచి మంగళవారం గుడి జీర్ణోద్ధారణ కార్యక్రమం చేపట్టడంతో హుటాహుటిన ఫారెస్ట్ అధికారులు విషయం తెలుసుకొని స్థలా ప్రాంగణంలోకి చేరుకొని కొండా సింగరయ్య స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తో చర్చించి ఈ గుడి రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉంది కనుక మీరు ఎన్ఓసి ఉత్తర్వులు తెచ్చుకున్న అనంతరం గుడి పునర్నిర్మాణం కార్యక్రమం చేపట్టాలని ఆదేశించడం జరిగింది. వెంటనే జీర్ణోదరణ పనులు నిలిపివేయడం జరిగింది. ఇది ముమ్మాటికి దేవాదాయ శాఖ అధికారుల తప్పిదశీ అంటూ భక్తులు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉంటారు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అర్హత కలిగిన ప్రతి ఓటరు వాటర్ జాబితాలో ఉంటారని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ అన్నారు. ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్.ఐ.ఆర్) కార్యక్రమంలో భాగంగా గృహ మ్యాపింగ్ పక్కాగా చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను గుంటూరు పట్టణం పశ్చిమ నియోజక వర్గం శాంతి నగర్ 181 పోలింగ్ కేంద్రం, అంకమ్మ నగర్ 179 పోలింగ్ కేంద్రాల పరిధిలో గురువారం సి.ఇ.ఓ పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడి, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ఏ విధంగా చేపడుతున్నది తెలుసుకున్నారు. అనంతరం గుంటూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఎ.ఇ.ఆర్ లతో చర్చించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అపార్టుమెంట్ల వద్ద ఓటరు నమోదుకు అపార్టుమెంట్ల సంఘాలతో సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. బూత్ స్థాయి అధికారి తో "బుక్ ఎ కాల్" వ్యవస్థ ద్వారా ఓటర్ల సందేహాలను నివృత్తి చేయుటకు కృషి చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యక్షంగా లేనివారు (ఆబ్సెంట్), ఇతర ప్రాంతాలకు వెళ్ళినవారు (షిఫ్టెడ్), మరణించినవారు (డెడ్), డూప్లికేట్, ఇతర దేశస్థులు (ఫారినర్ లు) క్రింద ఉన్న ఓటర్లు మినహా అందరూ ఓటరు జాబితాలో ఉండాలని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలని చెప్పారు.

గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ చేపడుతున్నామని వివరించారు. ప్రక్రియ వేగవంతం చేయుటకు బూత్ స్థాయి అధికారికి సహాయకులను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు కరపత్రాన్ని ఆవిష్కరించిన నాయకులు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** హలో రైతన్న చలో ఏలూరు వ్యవసాయాన్ని కాపాడుకుందాం రైతును రక్షించుకుందాం పేరుతో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలు సందర్భంగా ఏలూరు జూట్ మిల్ నుండి జూలై మూడో తేదీ భారీ రైతాంగ ప్రదర్శన బహిరంగ సభ జరుగుతుందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి తెలిపారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయం లో 23వ మహాసభలు కరపత్రాన్ని సిఐటియు జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ షేక్ హుస్సేన్ వల్లి రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ములకా శివకుమారి తో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ నేడు రైతు వ్యవసాయం సంక్షోభములో కొట్టుమిట్టాడుతుందని ఆయన అన్నారు. ఇతర దేశాల్లో వ్యవసాయ రంగానికి ఇబ్బడి ముబ్బడి గా సబ్సిడీలు పెంచుతుంటే మనదేశంలో తగ్గించి వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు . అమెరికా యూరోపియన్ యూనియన్ దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాల వలన సుంకాలు లేకుండా వ్యవసాయ ఉత్పత్తులు దిగుమతి అవుతాయని దీనివలన మనదేశంలో పాడి ఉద్యాన వాణిజ్య ఆహార పంటల రైతులు దెబ్బతింటారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం విత్తన చట్టం విద్యుత్ సవరణ చట్టం ఎరువుల విధానం పంటల భీమా చట్టం నూతన నీటి విధానం చట్టాలు తీసుకొచ్చిందని ఆయన వివరించారు. ఈచట్టాలన్నీ రైతులకు వ్యవసాయానికి నష్టం కలిగిస్తాయని కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఉండే చట్టాలని ఆయన తెలియజేశారు. జూలై 3 4 5 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలకు అఖిలభారత అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ అశోక్ ధావళి కృష్ణన్ అఖిలభారత సహాయ కార్యదర్శి టి సాగర్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వీ కృష్ణయ్య ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిలు గా పాల్గొంటారని ఆయన తెలిపారు.

## సర్ గూర్చి అవగాహన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బూర్ల రామాంజనేయులు ఆదేశాల మేరకు కాకుమాను మండలం కొండపాటూరు గ్రామ ఎస్ సి ఏరియా పరిధి లో సర్ (స్పెషల్ ఇంటెన్సివే రెవిషన్ ) కార్యక్రమంలో స్థానిక గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించడం, ఓటరు ఎనిమరేషన్ ఫార్మ్ పూర్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండపాటూరు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తోట నాగ ఫణీంద్రనాథ్ ,యూనిట్ ఇన్చార్జి గింజుపల్లి వంశీ కృష్ణా, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తమలపాకుల దైవ ప్రసాద్, ఈదర శరత్, జంగా మాణిక్యారావు ,గేరా రామారావు,తోట నాయుడు బాబు, స్వర్ణ రవి తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## విబి జీ రామ్ జి అభివృద్ధి పథంలో నూతన అధ్యాయం

- వికసిత భారత్ - 2047 కలలకు సాకారం
- రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) పథకం పల్లెసీమల ప్రగతికి గొప్పవరం



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** వికసిత భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ) (విబి జీ రామ్ జి ) అమలు అభివృద్ధి పథంలో ఒక నూతన అధ్యాయం అని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. విబి జీ రామ్ జి కార్యక్రమాన్ని పెదకాకాని మండలం ఉపాలపాడులో గురువారం లాంఛనంగా భూమి పూజ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విబి జీ రామ్ జి పథకంతో పల్లెలు వికసించనున్నాయని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం ఇప్పటి వరకు కొనసాగిందని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అనేక భవనాలు, కాలువలు, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విధానాల్లో నూతన అంశాలను జోడిస్తూ మరింత చక్కగా అభివృద్ధికి తోడ్పడే విధంగా విబి జీ రామ్ జి పథకాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు.

వికసిత భారత్ -2047, స్వర్ణ ఆంధ్రా - వికసిత ఆంధ్రప్రదేశ్ కలలను సాకరం చేసేందుకు దీన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. రెండు వందల బిలియన్ డాలర్ల ఎకానమీగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2047 సంవత్సరం నాటికి 2.40 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు. పల్లెసీమల ప్రగతికి విబి జీ రామ్ జి గొప్పవరం అని, ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి అర్హత గల గ్రామీణ కుటుంబానికి సంవత్సరంలో 125 రోజులు పని కల్పించుటకు చట్ట బద్ధమైన హామీని ఇస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శారీరక శ్రమ చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి కుటుంబానికి 125 రోజులు పాటు ఉపాధి కల్పిస్తారని, వ్యవసాయ పనులు సమయంలో ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ముందుస్తు ప్రకటన ద్వారా 60 రోజులు పాటు పనులను తాత్కాలికంగా నిలిపివేసే వెసులుబాటు ఉంటుందని అన్నారు. మిగిలిన 305 రోజుల్లో 125 రోజులు ఉపాధి హామీ అందుబాటులో ఉంటుందని అన్నారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడం దీనిలో ఒక ముఖ్యమైన భాగం అని, సాంకేతికత, పారదర్శకత కోసం సోషల్ ఆడిట్‌ను, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని తెలిపారు.

కొత్త చట్టం ద్వారా గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు, 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే (వికసిత్ భారత్ 2047) లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, గ్రామాల ఆస్తులు సృష్టి జరుగుతుందని అన్నారు. గ్రామీణ మహిళలు, యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. అర్హత ఉండి అడిగిన వారందరికీ జాబు కార్డులు, పనిదినాలు కల్పిస్తామని అన్నారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఉపాధి, జీవనోపాధి పథకాల ద్వారా లబ్ధిదారులు ఆదాయాన్ని పెంచుకోవాలని అన్నారు. గ్రామాల్లో పాఠశాలలు, అంగన్వాడి సెంటర్లు, సోలార్ ప్లాంట్లు కూడా ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు వేతనదారులకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, స్థానిక అధికారులు, అనధికారులు, శ్రామికులు పాల్గొన్నారు.

# మాతృమూర్తుల ఆరోగ్యానికి భరోసాగా ఉండాలి

- సిజేరియన్లు తగ్గించాలి
- మరణాలపై ఆడిట్ జరగాలి
- గర్భిణుల వివరాలు తప్పనిసరిగా నమోదు జరగాలి
- పాలియేటివ్ కేర్‌లో ముందున్న కేరళ ప్రభుత్వ చర్యలపై అధ్యయనం చేయాలి
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్)** :గర్భందాల్చిన ప్రతి ఒక్క మహిళ వివరాలు తప్పనిసరిగా పోర్టల్ లో నమోదు చేయాలని రాష్ట్రవైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ స్పష్టంచేశారు. దీనివల్ల తల్లితోపాటు బిడ్డకు ఆరోగ్య భద్రత లభిస్తోందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 40వేల పైచిలుకు ఆశాలు ఉన్నందున నూటికి నూరు శాతం గర్భిణు ల వివరాల నమోదు జరిగేలా అన్ని స్థాయుల్లోనూ కృషి జరగాలని తెలిపారు. మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయంలో కమిషనర్ చక్రధరబాబుతో కలిసి కార్యదర్శి సురేష్ కుమార్ సీజినల్ వ్యాధులు, పల్స్ పోలియో, హెచ్పీవీ వ్యాక్సిన్ పంపిణీ, జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా అమలవుతోన్న పథకాల సమన్వయ అధికారులతో గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువగా శ్రీకాకుళం జిల్లాలో 85.43%, ఏలూరు జిల్లాలో 87.0, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 87.36% చొప్పున ప్రెగ్నేట్ వుమెన్ పేర్ల నమోదు జరగడంపై అధికారులను వివరణ కోరారు. కర్నూలు జిల్లాలో 98.16%, పశ్చిమగోదావరి జిల్లాలో 97.99%, అల్లూరిసీతారామరాజు జిల్లాలో 96.90% ప్రెగ్నేట్ వుమెన్ వివరాలు నమోదుచేశారన్నారు. ఇక్కడ అవలంబించిన విధానాలను, తక్కువగా నమోదు జరిగిన జిల్లాల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులతో పరిశీలన చేసి, సదరు జిల్లాలకు తగిన ఆదేశాలు పంపాలని సమన్వయ అధికారులకు స్పష్టంచేశారు. అలాగే సిజేరియన్ కేసులు తగ్గించేందుకు కూడా కృషి జరగాలన్నారు. ముఖ్యంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 80.76%, శ్రీకాకుళం జిల్లాలో 75%, పశ్చిమగోదావరి జిల్లాలో 72.50% వం-కు సిజేరియన్ కేసులు నమోదుకావడానికి కారణాలు ఏమిటని అధికారులను ప్రశ్నించారు. సిజేరియన్లు ఏయే పరిస్థితుల్లో చేయాలో గర్భిణుల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని తెలిపారు. సహేతుకమైన కారణాలు లేకుండా సిజేరియన్లు జరుగుతుంటే... సదరు బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో వెనుకాడకూడదని స్పష్టంచేశారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో 62%, ప్రభుత్వాసుపత్రుల్లో 42% చొప్పున సిజేరియన్లు జరుగుతున్నాయని అధికారులు ముఖ్య కార్యదర్శికి వివరించారు. కిందటి ఆర్థిక సంవత్సరంలో జరిగిన 253 మాతృత్వ మరణాలపై ఆడిటింగ్ తప్పకుండా జరగాలని ముఖ్య కార్యదర్శి స్పష్టంచేశారు. ఆడిట్ ద్వారా గుర్తించిన అంశాలపై వైద్యులు, ఇతర సిబ్బందికి అవగాహన కలిపించి మాతృత్వ మరణాల తగ్గుదలకు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వాసుపత్రులో ఉన్న పాలియేటివ్ వార్డుల్లో ఉండే వారికి సపర్యలు చేసేందుకు ఉన్న సిబ్బంది వివరాలను సురేష్ కుమార్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఎన్జీఓల సహకారం తీసుకోవాలి!** : కేరళ ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలపై అధ్యయనం చేయాలని, ఎన్జీఓల సహకారాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రుల కలిపి 24 పాలియేటివ్ వార్డులు ఉన్నాయని అధికారులు వివరించారు. అలాగే సంచార చికిత్స ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 1,10,346 మంది వృద్ధులకు ఇళ్లల్లోనే సేవలు అందుతున్నాయని తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమన్వయంతో కలసి పనిచేయాలని అధికారులకు ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ స్పష్టంచేశారు. హాట్ స్పాట్స్ గా గుర్తించిన గ్రామాల్లో ప్రత్యేక చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ఉన్న చిన్నారుల్లో ఇప్పటివరకు 98.70% మంది పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు అధికారులు వెల్లడించారు. 15 ఏళ్లలోపు బాలికల్లో హెచ్పీవీ వ్యాక్సిన్ ను 83.67% మందికి వేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముందు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధరబాబు విడిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో వర్చువల్ గా సమావేశాన్ని నిర్వహించారు. మందుల కొరత రాకుండా చూడాలని, అవసరమైచోట్ల స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని స్పష్టంచేశారు.

## టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు హాజరైన మంత్రి లోకేష్



**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్):** టీటీడీ బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్ రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. గురువారం ఉదయం తిరుమలలోని కర్ణాటక భవన్ లో జరిగిన వివాహ మహోత్సవంలో పాల్గొని నూతన వధూవరులు డా.వైష్ణవి, డా.హర్షవర్ధన్ రెడ్డిలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న నూతన దంపతులకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర విజిలెన్స్ కమిటీలో చదలవాడ ప్రసాద్‌కు స్థానం



- ఆహార భద్రత చట్టం అమలు పర్యవేక్షణ కమిటీలో సభ్యుడిగా నామినేషన్

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** ఆహార భద్రత చట్టం సమర్థవంతమైన అమలు, ప్రజా పంపిణీ వ్యవస్థ పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించిన రాష్ట్ర స్థాయి విజిలెన్స్ కమిటీలో విజయనగరం జిల్లాకు చెందిన చదలవాడ ప్రసాద్ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఎక్స్అఫీషియో కార్యదర్శి కె. కన్నబాబు ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర విజిలెన్స్ కమిటీకి పౌర సరఫరాల శాఖ మంత్రి చైర్మన్‌గా, శాఖ కమిషనర్ వైస్‌చైర్మన్‌గా, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా, దివ్యాంగుల సంక్షేమ సంస్థల ప్రతినిధులతో పాటు 26 జిల్లాల జాయింట్ కలెక్టర్లు ప్రతిపాదించిన వినియోగదారుల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. కమిటీ పదవీకాలం మూడు సంవత్సరాలుగా నిర్ణయించారు.

రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎంపికైన చదలవాడ ప్రసాద్‌ను ఈ సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ), విశాఖపట్నం చాప్టర్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, వినియోగదారుల హక్కుల పరిరక్షణలో ఆయన సేవలు మరింత ఉపయోగపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రస్తుతం చదలవాడ ప్రసాద్ విజయనగరం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్‌చార్జిగా సేవలందిస్తున్నారు. రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఆయన నియామకాన్ని వినియోగదారుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల నాయకులు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.

## సీఎం, డిప్యూటీ సీఎంలపై వ్యాఖ్యలు.. బీజేపీ పోలీసులకు ఫిర్యాదు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఏలూరులో నిర్వహించిన దళిత క్రైస్తవ శంఖారావ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఉప సభాపతి, హిందూ స్వామీజీ శ్రీ రాధా మనోహర్ దాస్‌లను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బచ్చలకూరి జోసఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌పై, అలాగే సభ నిర్వాహకుడు జడ శ్రావణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మూడో మండల అధ్యక్షురాలు గాయత్రి బెహరా అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా జిల్లా కోశాధికారి డాక్టర్ సీహెచ్ స్రవంతి, బీజేపీ మూడో మండల ఉపాధ్యక్షులు జి. వరలక్ష్మి, మల్లికార్జున శర్మ, మండల కార్యదర్శి అన్న బాలరంగయ్య, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, మూడో మండల కార్మిక సెల్ కన్వీనర్ జంధ్యాల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీలో సౌకర్యాలపై అధికారుల పరిశీలన



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):**గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు ఎస్సీ కాలనీలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో భాగంగా తెనాలి డివిజనల్ పంచాయతి అధికారిణి స్వరూపారాణి గురువారం పరిశీలించారు . ఈ కాలనీలో కొత్తగా నిర్మించుకున్న గృహాలకు రహదారి, విద్యుత్తు, తాగునీటి సరఫరా లేనందున ఇబ్బందులు పడుతున్నామని జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆమె ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, గ్రామ పంచాయతీ అధికారి రామకృష్ణారెడ్డి తో కలిసి పరిశీలించారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు తగు చర్యలు తీసుకోవాలని స్వరూపారాణి ఆదేశించారు. చెట్లను తొలగిస్తామని, రహదారి నిర్మించడానికి గ్రామ పంచాయతీలో నిధులు లేవని రామకృష్ణారెడ్డి తెలిపారు. వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తి కాలేదని, పైపు లైను పెద్దది వేస్తేనే ఈ ప్రాంతానికి నీరు సరఫరా అవుతుందని ఆయన చెప్పారు. త్వరలో అందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కాలనీ ప్రజలు తమలపాకుల సుబ్బారావు, ఈదర శరత్ బాబు, జంగా మాణిక్యరావు, చెరుకూరి రత్నరాజు, జవ్వాది పురుషోత్తం, వేముల అరుణ తదితరులు పాల్గొని తమ సమస్యలను వివరించారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- ఉద్యోగుల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయండి
- జేఏసి జిల్లా చైర్మన్ డిఎస్ఎన్ రెడ్డి
- ఎంపీ కేశినేని శివనాథ్‌కు వినతి పత్రం అందజేత



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) జిల్లా నాయకులు గురువారం విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని)ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జిల్లా జేఏసీ చైర్మన్ డి. సత్యనారాయణ రెడ్డి నేతృత్వంలో ఎంపీని కలిసిన నాయకులు ఉద్యోగుల ప్రధాన సమస్యలను వివరించారు. పీఆర్సీ కమిటీని వెంటనే నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని, హెల్త్ కార్డుల వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, సరెండర్ లీవ్, పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయాలని కోరారు. అలాగే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ అమలు చేయడంతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌ను వేగవంతం చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పెన్షనర్లకు బకాయిల చెల్లింపు, అదనపు క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ వంటి అంశాలను కూడా ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

జూలై 26లోగా ప్రభుత్వం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ కార్యవర్గ సమావేశంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు. ఎం పి కి వినతి పత్రం అందజేసిన వారిలో జేఏసీ చైర్మన్ డి సత్యనారాయణ రెడ్డి తో పాటుసెక్రటరీ సయ్యద్ ఖాసిం, కో–చైర్మన్ , సిహెచ్ రామకృష్ణ, వైస్ చైర్మన్ –జి.నారాయణరావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.రామకృష్ణ, కోశాధికారి – బి.సతీష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ సుందరయ్య, విష్ణువర్ధన్ రావు, క్షమా బేగం, విజయవాడ సిటీ జేఏసీ చైర్మన్ సిహెచ్.సివిఆర్ ప్రసాద్, సిటీ సెక్రటరీ – కాయమ్, నగర శాఖ కోచ్ చైర్మన్ నజురుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదరిక నిర్మూలనకు శక్తివంతమైన సాధనం విద్య




**పురిటిగడ్డ (జర్నలిస్ట్ ఫైల్):** పేదరిక నిర్మూలన మరియు నైపుణ్యాలను వికసింప చేయటానికి శక్తివంతమైన సాధనం విద్య అని రిటైర్డ్ మండల విద్యాశాఖ అధికారి వేమూరి మురళీకృష్ణ తెలిపారు. హైదరాబాదుకు చెందిన సుంకర ఆదిత్య రామ్ సమకూర్చిన విద్యాసామాగ్రిని ఎంపీపీ పాఠశాల పురిటిగడ్డ లో విద్యార్థులకు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన వేమూరి మురళీకృష్ణ మాట్లాడుతూ చిన్నారుల చదువుల కొరకు బలహీన వర్గాల కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేలా దాతలు విద్యాసామాగ్రిని అందజేయడం ప్రశంసనీయమని అన్నారు.

నిరుపేద విద్యార్థులకు చేయూతనిచ్చి వారికి భవిష్యత్తు పట్ల ఆశ, ఆత్మవిశ్వాసం పెంచేలా చూడడం సమాజంలో ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలు,ఇతర విద్య సామాగ్రిని అందజేస్తున్న ఆదిత్య రామ్ ను అభినందించారు.

ప్రభుత్వ సేవలతో పాటు దాతలు అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని మురళీకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య రామ్ కుటుంబ సభ్యులు సుంకర గాంధీ వరప్రసాద్,శారదా దేవి, నాదెండ్ల సుధాసాగర్, భవసాగర్,గోపాలకృష్ణ ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్ బాబు,నాగలక్ష్మి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలోని లాలాపేటలో ఉన్న పద్మావతి ఆండాళ్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణ పనులకు గురువారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొని పునఃనిర్మాణ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా ఆలయ పునఃనిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ అభివృద్ధికి ప్రజల సహకారం కూడా అవసరమని అన్నారు.

కార్యక్రమంలో ఎండోమెంట్ శాఖ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి టి. సుభద్ర, దేవస్థాన పాలకమండలి చైర్మన్ మల్లెంపూడి శ్రీనివాసరావు, సభ్యుడు బొలిశెట్టి జగదీష్ పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కె.వి. సుబ్బారావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నేరెళ్ల మాధవరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమార్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భజరంగ్ రామకృష్ణ, ఉడత నరసింహారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు హాజరయ్యారు.

వేదమంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ పునఃనిర్మాణం పూర్తయిన అనంతరం భక్తులకు మరింత విశాలమైన, సౌకర్యవంతమైన ఆధ్యాత్మిక కేంద్రంగా ఈ దేవాలయం రూపుదిద్దుకోనుందని నిర్వాహకులు తెలిపారు.

## అర్హులైన ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలి : ఏపీజీఈఎస్ఏ వినతి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అర్హులైన ఉద్యోగులకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ (ఏపీజీఈఎస్ఏ) నాయకులు గుంటూరు ప్రాంతీయ సంచాలకుడు నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన సంఘం నాయకులు, జూనియర్ అసిస్టెంట్లను సీనియర్ అసిస్టెంట్లుగా, ఎంపీహెచ్ఏ (ఎఫ్)లను హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ విజిటర్లుగా, స్టాఫ్ నర్సులను హెడ్ నర్సులుగా, హెడ్ నర్సులను గ్రేడ్–2 నర్సింగ్ పర్యవేక్షకులుగా పదోన్నతులు కల్పించాలని కోరారు.

ఏపీజీఈఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్ బాషా, జిల్లా అధ్యక్షుడు రెహమాన్ మాట్లాడుతూ, పదోన్నతులు కల్పించడం ద్వారా ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. దీనిపై స్పందించిన ప్రాంతీయ సంచాలకుడు నాగరాజు, సాధ్యమైనంత త్వరగా పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులు డి.రాజు, జిల్లా కోశాధికారి రాజు, సంయుక్త కార్యదర్శి కోటయ్య, నగర శాఖ అధ్యక్షుడు భాను, ఉపాధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అమృతలూరులో వీబీ-జీ రాం జీ ప్రారంభం : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

- ఉపాధి హామీ పనుల్లో కార్మికులతో కలిసి పనిచేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అమృతలూరు మండలం అమృతలూరు గ్రామంలో గురువారం వికసిత్ భారత్ గ్రామ అభియాన్ (వీబీ–జీ రాం జీ) కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించారు. అనంతరం పనుల్లో నిమగ్నమైన కార్మికులతో కలిసి స్వయంగా పనిచేస్తూ వారితో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తర్వాత గ్రామంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన వికసిత్ భారత్ గ్రామ అభియాన్ (వీబీ–జీ రాం జీ) సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు పనులకు శంకుస్థాపన చేశారు. తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో జరిగిన రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ గ్రామ అభియాన్ (వీబీ–జీ రాం జీ) ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించిన అనంతరం స్థానికంగా అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, కేంద్ర––రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలు చేస్తున్న వికసిత్ భారత్ గ్రామ అభియాన్ (వీబీ–జీ రాం జీ) గ్రామీణాభివృద్ధికి కొత్త దిశను చూపే కార్యక్రమమన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి అవకాశాల పెంపు, సంక్షేమ కార్యక్రమాల విస్తరణ, నీటి సంరక్షణ, గ్రామీణ రహదారుల అభివృద్ధి, సామూహిక ఆస్తుల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ వంటి పనులకు ఈ కార్యక్రమం ఊతమిస్తుందని చెప్పారు. అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఏడాదికి 125 రోజుల ఉపాధి కల్పించడంతో పాటు ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ప్రతి గ్రామం అభివృద్ధి చెందితేనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులు, మహిళా సంఘాలు, యువత గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి ఫలాలు ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామస్థాయిలో పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు కనిపించే అభివృద్ధిని అందించడంలో వికసిత్ భారత్ గ్రామ అభియాన్ (వీబీ–జీ రాం జీ) కీలకంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పంచాయతీ ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, ఉపాధి హామీ కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467